


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 26 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 18 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-

## వడ్డెర్లకు మైనింగ్ లీజుల్లో
# రిజర్వేషన్



- వచ్చే క్యాబినెట్ నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- ఖనిజ సంపదకు విలువ జోడింపుతో మరింత రాబడి
- తవ్వకాలను శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ టెక్నాలజీతో విశ్లేషించాలి
- ఇసుక లోడింగ్, రవాణాకు తక్కువ వ్యయం ఉండాలి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

వడ్డెర్లు, వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం మేర కేటాయించేలా విధివిధానాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వీరికి 15 శాతం లీజుల రిజర్వేషన్ కల్పించే అంశంపై వచ్చే క్యాబినెట్ నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. వారికి కేటాయించే గనుల లీజుల్లో ప్రీమియం, సీనరేజ్‌ల్లోనూ 50 శాతం రాయితీ ఇవ్వాలని ఆదేశించారు. సీఎం శుక్రవారం సచివాలయంలో గనులశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడినవర్గాలైన వడ్డెర్లకు లీజుల రిజర్వేషన్ ద్వారా ఆర్థికంగా మేలు కలిగేలా ఉండాలని, వారు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేందుకు కూడా చూడాలని ఆదేశించారు. 'రాష్ట్రంలో లభించే ఖనిజ సంపదపై సమగ్రంగా అధ్యయనం చేయాలి. వాటికి విలువ జోడింపుతో అదనపు ఆదాయం వస్తుంది. ఒడిశా వంటి రాష్ట్రాల్లో విలువ జోడింపు ద్వారా ఖనిజాల ద్వారానే రూ.50 వేల కోట్ల ఆదాయం వస్తోంది. ఏపీలోనూ ఇందుకు తగిన ప్రణాళిక రూపొందించి, విలువ జోడింపు జరిగితే ఏటా రూ.20-30 వేల కోట్ల రాబడి వచ్చే అవకాశం ఉంటుంది. బీచ్‌శాండ్ వంటి భార ఖనిజాల మైనింగ్‌తో పాటు వాటికి కూడా విలువ జోడిస్తే, అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుంది. వీటన్నింటిపై అధ్యయనం చేయాలి' అని సీఎం ఆదేశించారు. 'మైనింగ్ లీజుల్లో తవ్వకాలపై శాటిలైట్ చిత్రాలు,

- మిగతా 2లో



## భారత్‌ను ఎవ్వరూ ఆపలేరు

- ప్రపంచంలో ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి
- కాంగ్రెస్ హయాంలో కుప్పలు, తెప్పలుగా నిరర్థక ఆస్తులు
- గతంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిన నిరర్థక ఆస్తుల పరిస్థితిని అదుపు చేసేందుకు తాము కార్యచరణను చేపట్టాం
- బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు తెచ్చాం
- డిజిటల్ లావాదేవీల్లో ఇండియాను ఆర్థికంగా అత్యంత సమ్మిళిత దేశాల్లో ఒకటిగా తీర్చిదిద్దాం
- ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాల్లో ఒకటి

6



## పాకిస్థాన్ ప్రభుత్వానికి మరో తలనొప్పి

- పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటైన కొత్త మతపరమైన కూటమి
- 'అహ్లె-ఇ-సున్నత్ పాకిస్థాన్' కూటమికి టీఎల్‌పీ నాయకత్వం
- కూటమికి మద్దతు ప్రకటించిన మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ

6

## మిథున్‌రెడ్డి న్యూయార్క్ పర్యటనకు
# కోర్టు అనుమతి



- 50 వేల చొప్పున 2 పూచీకత్తులు..
- విమాన టికెట్ల ఫొటో కాపీలు కోర్టుకివ్వాలి..
- అక్కడ బస వివరాలు చెప్పాలి: న్యాయాధికారి
- మద్యం కేసులో మిగతా నిందితులకు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

న్యూయార్క్ పర్యటనకు వెళ్లేందుకు ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. దీనిపై న్యాయాధికారి భాస్కరరావు శుక్రవారం సాయంత్రం తీర్పును వెలువరించారు. కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిన ఎంపీల బృందంతో కలిసి తాను న్యూయార్క్ వెళ్లాల్సి ఉందని దానికి అనుమతి ఇవ్వడంతో

- మిగతా 2లో



## పెట్టుబడులు ఆకర్షించాలంటే ప్రోత్సాహకాలు ఇవ్వక తప్పదు


- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- "ఒక ప్రాంతాన్ని కానీ, వ్యాపారాన్ని కానీ అభివృద్ధి చేసి ఒక ఎకో సిస్టం సృష్టించాలనుకున్నప్పుడు తొలుత త్యాగాలు చేయాల్సి వస్తుంది
- కొత్త కంపెనీ ఉత్పత్తి తయారుచేసి ఇష్టం వచ్చిన రేటు పెడితే ఎవరూ కొనరు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

స్టార్టప్‌లాంటి ఆంధ్రప్రదేశ్‌లోకి పెట్టుబడులను ఆకర్షించాలంటే ప్రోత్సాహకాలు ఇవ్వక తప్పదని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి గతేడాదిన్నర కాలంలో తమ శాఖ సాధించిన పురోగతిని జాతీయ మీడియా సెంటర్‌లో మీడియాకు వివరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంలో విశాఖపట్నంలో

- మిగతా 2లో

## ఏళ్ల తరబడి కౌంటర్
# దాఖలు చేయరా?



- కోర్టులన్నా.. కోర్టు ఆదేశాలన్నా అంత నిర్లక్ష్యమా?
- పోలీసుల తీరుపై హైకోర్టు మండిపాటు
- అసలు మీ గురించి మీరేమనుకుంటున్నారు?
- తీరికున్నప్పుడు కౌంటర్ వేస్తామంటే చూస్తూ ఊరుకోవాలా?
- ప్రజలకు మాపై నమ్మకం పోయే పరిస్థితిని రానివ్వం
- 8 ఏళ్లుగా కేసును పక్కన పడేసి.. ఇప్పుడు అనుమతి కోరతారా?

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ 2017లో పిటిషన్ దాఖలైతే.. ఏళ్ల తరబడిగా పోలీసులు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై హైకోర్టు తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. ఏమిటీ నిర్లక్ష్యమంటూ మండిపడింది. కోర్టులన్నా, కోర్టు ఆదేశాలన్నా పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీ గురించి మీరేమనుకుంటున్నారంటూ పోలీసులను నిలదీసింది. తీరిగ్గా మీకు కావాల్సినప్పుడు కౌంటర్ దాఖలు చేస్తామంటే చూస్తూ ఊరుకోమంటారా? అని నిలదీసింది. ఇలాగే వదిలిస్తే.. పదేళ్ల తరువాత కూడా కౌంటర్ దాఖలు చేసినా ఏమీ కాదనే ధోరణితో అధికారులు ఉంటారని, దీనివల్ల కోర్టులపై ప్రజలకు నమ్మకంపోతుందని వ్యాఖ్యానించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి పరిస్థితిని రానివ్వబోమని స్పష్టం చేసింది. ఎనిమిదేళ్లుగా కౌంటర్ దాఖలు చేయకుండా చోద్యం చూసిన పోలీసులు ఇప్పుడు అందుకు అనుమతి కోరడాన్ని తప్పుబట్టింది. ఈ అసాధారణ జాప్యానికి రూ.10 వేలు ఖర్చుల కింద చెల్లించాలని, అప్పుడు మాత్రమే కౌంటర్ దాఖలుకు అనుమతినిస్తామని అనంతపురం జిల్లా ధర్మవరం వన్‌టౌన్

- మిగతా 2లో

## నాసిక్‌లో తొలి తేజస్సు

**తేజస్-ఎంకే1ఏ తొలి ప్రయాణం విజయవంతం**

6

## ఆయుధం వీడి.. జన జీవన స్రవంతిలోకి

- మరో 208 మంది కూడా.. వీరిలో 110 మంది మహిళలు
- పోరు వదల్లేదు.. ఇకపై రాజ్యాంగబద్ధంగా పని: ఆశన్న
- లొంగిపోవడానికి వచ్చిన మావోయిస్టులు మౌనంగా కనిపించారు.
- ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి సమక్షంలో భారీగా ఆయుధాల అప్పగింత

6



# వడ్డెర్లకు మైనింగ్ లీజుల్లో రిజర్వేషన్



-మొదటిపేజీ తరువాయి

డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలి. ఇచ్చిన పర్మిట్ల మేరకే తవ్వకాలు జరిగాయా? లేదా అనే విశ్లేషణ జరగాలి. పెండింగ్‌లో ఉన్న 6,500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలి. వైఎస్సార్ కడప జిల్లాలో నిర్మించతలపెట్టిన స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుప ఖనిజం సరఫరాపై అధ్యయనం చేయాలి' అని చంద్రబాబు కోరారు.

**ఉచిత ఇసుకపై విస్తృతంగా తనిఖీలు**

'ఉచిత ఇసుక సరఫరా సమర్థంగా అమలు కావాలి. వ్యవస్థలో లోపాలను వినియోగించుకొని దుర్వినియోగం చేసేందుకు అవకాశం లేకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. ఇసుక లోడింగ్‌తోపాటు, రవాణాకు అతి తక్కువ వ్యయమయ్యేలా చూడాలి. అంతర్‌రాష్ట్ర సరిహద్దు మార్గాల్లో సీసీ కెమెరాలతో నిఘాను మరింత పటిష్ఠం చేయాలి. ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత ఇసుక విధానంపై పర్యవేక్షించాలి' అని సీఎం పేర్కొన్నారు.

**రూ.3,320 కోట్ల రాబడి లక్ష్యం**

మైనర్, మేజర్ మినరల్స్ ద్వారా ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,320 కోట్ల రాబడి లక్ష్యంగా పెట్టుకున్నట్లు గనులశాఖ అధికారులు..ముఖ్యమంత్రికి తెలియజేశారు. గతంతో పోలిస్తే 34 శాతం అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. మాంగనీస్ వంటి మేజర్ ఖనిజాల ద్వారా 72 శాతానికిపైగా ఆదాయం వస్తున్నట్లు వెల్లడించారు. ఈ వర్షాకాల సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వచేశామని, ప్రస్తుతం 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**లీజుల కేటాయింపులో ఏం జరుగుతోందో చూసుకోరా?**

గనులశాఖ మంత్రి, అధికారులకు సీఎం క్లాస్

ఈనాడు-అమరావతి: 'లీజుల కేటాయింపులో ఏం జరుగుతోందో చూసుకోరా? వీటి వెనుక ఎవరున్నారు, ఆ లీజులు ఎలా దక్కించుకున్నారనేది పరిశీలించరా? గనులశాఖలో ఏం జరుగుతోంది' అంటూ సీఎం చంద్రబాబు.. ఆ శాఖ మంత్రి, అధికారులకు క్లాస్ తీసుకున్నారు. గనులశాఖపై సీఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'కూటమి ప్రభుత్వంలోనూ.. పెద్దిరెడ్డి అనుచరులకు దర్జాగా లీజులు' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై సీఎం ప్రశ్నించారు. ఇలాంటివారికి లీజులు ఎలా మంజూరు చేస్తున్నారని ప్రశ్నించారు.

గత ప్రభుత్వంలో పెద్దిరెడ్డి, ఆయన మనుషులు మైనింగ్‌లో పెద్దఎత్తున దోచుకున్నారని, లీజుదారులను భయపెట్టి లీజులు లాక్కొని దందా చేశారని సీఎం పేర్కొన్నారు. బలవంతంగా లాక్కున్న క్వారీల్లో మైనింగ్ జరిపాక, వాటి క్రషర్లకు వచ్చిన విద్యుత్ బిల్లులను సైతం అసలు లీజుదారులతో ఒత్తిడి చేసి కట్టించారని తెలిపారు. అంతలా అక్రమాలకు పాల్పడ్డ వారికి మళ్లీ లీజులు మంజూరవుతుంటే ఏం చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌లను ప్రశ్నించారు. ఇకపై జాగ్రత్తగా ఉండాలని సీఎం ఆదేశించారు.

రెండు లీజులు మంజూరు చేశాం: కమిషనర్ వివరణ

మురళీకృష్ణ స్టోన్ క్రషర్స్ పేరిట ఇప్పటివరకు రెండు లీజులు మంజూరు చేశామని, వీటిలో ఒక్కటే ఎగ్జిక్యూట్ చేశామని గనులశాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లా నగరి మండలానికి చెందిన పి.రమేశ్‌కు చెందిన మురళీకృష్ణ స్టోన్ క్రషర్స్ పేరిట ఉత్తరాంధ్రలో గ్రానైట్ లీజులు మంజూరయ్యాయి. దీనిపై 'కూటమి ప్రభుత్వంలోనూ..పెద్దిరెడ్డి అనుచరులకు దర్జాగా లీజులు' శీర్షికతో 'ఈనాడు'లో వచ్చిన కథనంపై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం వివరణ ఇచ్చారు.

విజయనగరం జిల్లా మెంటాడ మండలం కొండలింగవలసలో రెండు గ్రానైట్ లీజులను మురళీకృష్ణ స్టోన్ క్రషర్స్ 2022లో ఈ వేలంలో దక్కించుకుందని తెలిపారు. వివిధ అనుమతులు తెచ్చుకోవడంతో 4.97 హెక్టార్లలో ఒక లీజును ఈ ఏడాది జూన్ 30న మంజూరు చేశామని, దానికి సెప్టెంబరు 26న ఎగ్జిక్యూట్ చేసినట్లు వెల్లడించారు. 4.96 హెక్టార్లలో మరో లీజు ఇంకా మంజూరు చేయలేదని పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలోని వీజే పురంలో 4.11 హెక్టార్లలో కలర్ గ్రానైట్ లీజును 2022లో నిర్వహించిన ఈ-వేలంలో సింగిల్ బిడ్‌తో మురళీకృష్ణ స్టోన్ క్రషర్స్ దక్కించుకుందని తెలిపారు. వివిధ అనుమతులు పొందడంతో ఈ ఏడాది జులై ఒకటిన లీజు మంజూరు చేశామని, అయితే లీజు ఎగ్జిక్యూషన్ గడువు సెప్టెంబరు 29తో ముగిసిందని, అమలు చేయలేదని పేర్కొన్నారు. సంగిరెడ్డి శివప్రసాద్ భార్య స్వాతి పేరిట శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం కొండతెంబూరు గ్రామంలో సర్వే నంబరు 29లో 4.9 హెక్టార్ల విస్తీర్ణంతో రెండు కలర్ గ్రానైట్ లీజుల కోసం 2013లో దరఖాస్తు చేసుకోగా, వీటికి 2020లో ఎల్‌వోఐలు జారీ అయ్యాయని పేర్కొన్నారు. వీటిలో ఒక లీజుకు మైనింగ్‌ప్లాన్, పర్యావరణ అనుమతుల పత్రాలు గతంలో అందజేశారని తెలిపారు. స్వాతి పేరిట ఇంకా లీజులు మంజూరు చేయలేదని వెల్లడించారు. ఈ లీజుల మంజూరు విషయంలో శాఖాపరంగా తప్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గనులశాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

# ఏ తప్పూ చేయకుండా జైల్లో మగ్గుతున్నారు

విజయవాడ



మద్యం అక్రమ కేసులో ఏ తప్పూ చేయకుండా నిందితులు సుదీర్ఘకాలం జైళ్లలో మగ్గుతున్నారని డిఫెన్స్ న్యాయవాదులు ఏసీబీ కోర్టుకు విన్నవించారు. ఈ కేసులో విచారణ పూర్తయ్యిందని, ఇందుకు అనుగుణంగా చార్జ్‌షీట్లు కూడా దాఖలుయ్యాయని పేర్కొంటూ రాజ్యాంగంలోని 21వ అధికరణ ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ హక్కుకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ నిందితులకు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును అభ్యర్థించారు. నిందితులకు బెయిల్ మంజూరుచేస్తే, విచారణకు ఎప్పుడు పిలిచినా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఎటువంటి షరతులకైనా సిద్ధమని కోర్టుకు విన్నవించారు.

ఈ కేసులో జైలులో ఉన్న రాజ్ కేసిరెడ్డి, చెరుకూరి వెంకటేషునాయుడు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూనేటి చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణల బెయిల్ పిటిషన్‌లపై ఏసీబీ కోర్టులో శుక్రవారం వాదనలు జరిగాయి. నిందితుల తరపున సీనియర్ న్యాయవాదులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, చంద్రగిరి విష్ణువర్ధన్, నాగేంద్రరెడ్డి, ఎం వాణి, నగేషురెడ్డి వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆన్‌లైన్‌లో హాజరై వాదనలు వినిపించారు. బెయిల్ పిటిషన్లపై ఇరు పక్షాల వాదనలు ముగియడంతో తీర్పును కోర్టు ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది.

**ఎటువంటి ఆధారాలూ చూపలేకపోయిన సిట్: పొన్నవోలు**

రాజ్ కేసిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'కేసుకు సంబంధించి నిందితులపై సిట్ విచారణ పూర్తిచేసి, చార్జ్‌షీటు కూడా దాఖలుచేసింది. ఈ కేసులో 409 మంది సాక్షులను విచారించింది. గత ప్రభుత్వ లిక్కర్ పాలసీలో రాజ్ కేసిరెడ్డికి ఎటువంటి సంబంధం లేదు. ఈ కేసులో సిట్ ఎటువంటి ఆధారాలు చూపలేకపోయింది. సిట్ అధికారులు సెల్‌టవర్ లొకేషన్ ఆధారంగా రాజ్ కేసిరెడ్డిని ముద్దాయిగా నిర్ధారిస్తూ రిమాండ్ రిపోర్టుల్లో పేర్కొనడం తగదు. వాస్తవానికి ఒక్కో టవర్ లొకేషన్ 3 నుండి 5 కిలోమీటర్ల పరిధి కలిగి ఉంటుంది. ఆ పరిధిలో ఎంతో మంది సెల్‌ఫోన్‌లు వాడతారు. అంతమాత్రాన ఈ కేసుతో వారందరికీ నిందితులతో సంబంధం ఉందని ఎలా నిర్ధారిస్తారు? సిట్ అధికారులు నిందితుడి కార్యాలయం కూడా జూబ్లీహిల్స్ పరిధిలో ఉందని చెబుతున్నారు. ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి లొకేషన్ కూడా అదే పరిధిలో ఉంది. అంతమాత్రాన ఆయనకు కేసుతో సంబంధం ఉందని భావించాలా?. రాజ్ కేసిరెడ్డిని కావాలనే 188 రోజులుగా జైలులో ఉంచారు. అరవింద్ కేజ్రీవాల్ వర్సెస్ సీబీఐ, కల్వకుంట్ల కవితకు సంబంధించిన కేసులలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను అనుగుణంగా రాజ్ కేసిరెడ్డికి బెయిల్ మంజూరు చేయవలసినదిగా కోరుతున్నాను' అని అన్నారు.

**24వరకు రిమాండ్ పొడిగింపు**

రాజ్ కేసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేష్ నాయుడు ,చాణక్య, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలకు ఈనెల 24వరకు రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. రిమాండ్ ముగియడంతో శుక్రవారం వారిని కోర్టులో హాజరు పరిచారు.

**సాగదీత ధోరణి మార్చుకోని లూథ్రా**

ప్రాసిక్యూషన్ తరపున తొలుత వాదనలను వినిపించిన లూథ్రా గురువారం తరహాలోనే కేసు కౌంటర్, రిమాండ్ రిపోర్టులు సుదీర్ఘంగా చదువుతూ, 'అదే వాదన' అన్న ధోరణిని ప్రదర్శించారు. ఈ సందర్భంలో డిఫెన్స్ తరపున న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గంటలు గంటలు కౌంటర్, రిమాండ్ రిపోర్టులు చదువుతూ పోతే వాదనలు ఎప్పుడు వినిపిస్తారని ప్రశ్నించారు. కోర్టు విలువైన సమయాన్ని లూథ్రా వృథా చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ఎంపీ మిథున్‌రెడ్డి అమెరికా వెళ్లేందుకు అనుమతి**

రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఈ నెల 27 నుంచి 31 వరకు న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 80వ సెషన్‌కు హాజరయ్యేందుకు అనుమతిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 23 నుంచి నవంబరు 4వ తేదీ వరకు ఆయనకు అనుమతి మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పి. భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు. రూ. 50వేలు చొప్పున ఇద్దరి పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అమెరికా పర్యటన ముగించుకొని తిరిగి రాగానే పాస్ పోర్టు తిరిగి కోర్టుకు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**చెవిరెడ్డిపై కేసు అంతా కుట్ర కోణమే: న్యాయవాది వాణిరెడ్డి**

చెవిరెడ్డి భాస్కరరెడ్డి తరపు న్యాయవాది వాణిరెడ్డి వాదనలు వినిపిస్తూ...ఆయన ప్రజులలో నుండి వచ్చారని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడని అన్నారు. ఈ కేసుతో ఆయనకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

**వాదనల్లో మరికొన్ని అంశాలు..**

' గన్‌మెన్ గిరిబాబు సాక్ష్యం ఆధారంగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిపై ఈ అక్రమ కేసు నమోదుచేశారు.

' సిట్ అధికారులు గిరిబాబును 2025 జూన్ 1న విచారణ జరిపారు.

' ఆ మర్నాడు జూన్ 2న అతనికి ప్రమోషన్ కల్పించి భారీ వేతనం పెంపుతో ఆక్టోపస్‌లోకి తీసుకున్నారు.

' కేసు వెనుక ప్రలోభాల పర్వం ఎంత దారుణంగా ఉందో ఈ ఒక్క విషయం అద్దం పడుతోంది.

' బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ ఇరువురు చిరు ఉద్యోగులు.

' వారిని కూడా సంబంధం లేని మద్యం కేసులో అక్రమంగా అరెస్టు చేశారు.

' నిందితులకు సంబంధించిన పాస్‌పోర్టులను సీజ్‌చేశారు.

' లుక్‌అవుట్ నోటీసులు కూడా జారీచేశారు.

' ఇటువంటి పరిస్థితులలో నిందితులు ఎక్కడికి పారిపోయే పరిస్థితి లేదు.

' రాజ్యాంగంలోని 21వ అధికరణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థిస్తున్నాము.

## ఏళ్ల తరబడి కౌంటర్ దాఖలు చేయరా?

-మొదటిపేజీ తరువాయి

ఇన్‌స్పెక్టర్ పి.నాగేంద్ర ప్రసాద్‌కు స్పష్టం చేసింది. ఈ మొత్తాన్ని హైకోర్టు న్యాయవాదుల క్లర్కుల సంఘానికి చెల్లించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. కోర్టుకు సరైన వివరాలు వెల్లడించనందుకు సుమోటోగా చేపట్టిన కోర్టు ధిక్కార వ్యాజ్యంలో నాగేంద్ర ప్రసాద్‌కు నోటీసులు జారీ చేస్తూ దీనిపై విచారణను కూడా అదే రోజుకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**సుమోటోగా కోర్టు ధిక్కార చర్యలు...**

కొందరు వ్యక్తులతో తమకున్న సివిల్ వివాదాలపై పోలీసులు జోక్యం చేసుకోవడంపై అనంతపురం జిల్లా ధర్మవరం వాసి ఏ.రాజశేఖర్ 2017లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించినా ఇప్పటివరకు దాఖలు చేయలేదు. గత వారం ఈ వ్యాజ్యం విచారణకు వచ్చిన సమయంలో ధర్మవరం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ స్వయంగా కోర్టు ముందు హాజరయ్యారు. లక్ష్మీదేవమ్మ అనే మహిళ ఫిర్యాదు మేరకు పిటిషనర్ రాజశేఖర్‌పై కేసు నమోదు చేశామని 2017లో పేర్కొన్న పోలీసులు ఇటీవల అందుకు విరుద్ధంగా చెప్పారు. అసలు ఎవరి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పడంపై న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్ తీవ్రంగా స్పందించారు. ఇలా పరస్పర విరుద్ధ వివరాలను కోర్టు ముందుంచినందుకు నాగేంద్ర ప్రసాద్‌పై న్యాయమూర్తి సుమోటోగా కోర్టు ధిక్కార చర్యలు చేపట్టారు.

**పోలీసులకు స్పష్టమైన సందేశం ఇవ్వదలిచాం**

తాజాగా ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా పోలీసుల తీరుపై న్యాయమూర్తి మండిపడ్డారు. ఈ కేసులో పోలీసుల నిర్లక్ష్యం ప్రతి దశలోనూ కనిపిస్తోందన్నారు. ఇటీవల కాలంలో కోర్టుల పట్ల పోలీసులు అత్యంత నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. అందువల్లే పోలీసుల విషయంలో తాము కఠినంగా వ్యవహరిస్తున్నామని, తద్వారా వారికి స్పష్టమైన సందేశం పంపదలిచామన్నారు. కోర్టు ఒకసారి నోటీసులు జారీ చేసిన తరువాత పోలీసులు కౌంటర్ దాఖలు చేసి తీరాల్సిందేనని, ఇందులో ఎలాంటి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. రిట్ రూల్స్ ప్రకారం 180 రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలన్నారు.

## మిథున్‌రెడ్డి న్యూయార్క్ పర్యటనకు కోర్టు అనుమతి

-మొదటిపేజీ తరువాయి

పాటు సిట్ అధికారులు జారీచేసిన లుక్ అవుట్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని మిథున్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదనలు ముగియడంతో న్యాయాధికారి తీర్పును వెలువరించారు. న్యూయార్క్ వెళ్లి తిరిగి రావడానికి ఈ నెల 23 నుంచి వచ్చే నెల 4 వరకు అనుమతి ఇచ్చారు. 'వెళ్లడానికి ముందు రూ.50 వేల చొప్పున రెండు జామీన్లను సమర్పించాలి. విమానం టికెట్ల ఫొటోస్టాట్ కాపీలు, న్యూయార్క్‌లో ఎక్కడ బస చేస్తున్నారన్న వివరాలను న్యాయస్థానానికి అందజేయాలి. ఈమెయిల్ ఐడీ, ఫోన్ నంబర్లు తెలియజేయాలి. అమెరికా నుంచి రాగానే పాస్‌పోర్టును సిట్ అధికారులకు అప్పగించాలి' అని షరతులు విధించారు. మరోవైపు.. మద్యం కుంభకోణంలో జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలకు ఏసీబీ కోర్టు ఈ నెల 24 వరకు రిమాండ్ పొడిగిస్తున్నట్టు న్యాయాధికారి భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్‌నాయుడు, బూనేటి చాణక్య విజయవాడ జిల్లా జైల్లో ఉండగా.. నవీన్‌కృష్ణ, బాలాజీకుమార్ యాదవ్ గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. కాగా.. బెయిల్ కోసం వీరు దాఖలు చేసుకున్న పిటిషన్లపై 24న తీర్పు వెలువరిస్తానని న్యాయాధికారి ప్రకటించారు.

## పెట్టుబడులు ఆకర్షించాలంటే ప్రోత్సాహకాలు ఇవ్వక తప్పదు

-మొదటిపేజీ తరువాయి

గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాల గురించి కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే చేసిన వ్యాఖ్యల గురించి విలేకర్లు ప్రశ్నించినప్పుడు పెమ్మసాని స్పందించారు. "ఒక ప్రాంతాన్ని కానీ, వ్యాపారాన్ని కానీ అభివృద్ధి చేసి ఒక ఎకో సిస్టం సృష్టించాలనుకున్నప్పుడు తొలుత త్యాగాలు చేయాల్సి వస్తుంది. కొత్త కంపెనీ ఉత్పత్తి తయారుచేసి ఇష్టం వచ్చిన రేటు పెడితే ఎవరూ కొనరు. వినియోగదారులను ఆకర్షించడానికి తొలుత ఆ ఉత్పత్తి నమూనాలను ఉచితంగా ఇవ్వడమో, డిస్కౌంట్లు ఇవ్వడమో చేస్తుంది. ఆ తర్వాతే ప్రజలు కొనడం మొదలుపెడతారు. డేటా సెంటర్ల ఏర్పాటుకూ అదే వర్తిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఏమీలేని చిన్న రాష్ట్రం. ఎలాంటి ఎకో సిస్టం లేని చోట ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే ఎవరూ రారు. గూగుల్ ప్రకటన తర్వాత ఈరోజు ఎన్నో ఎంక్వయిరీలు వస్తున్నాయి" అని పేర్కొన్నారు.

## విలేజ్‌లకు..టౌన్ లుక్!

అమలాపురంరూరల్




కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీరాజ్‌శాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను చేపట్టి అందరి మన్ననలు పొందింది. ఇదిలా ఉండగా పంచాయతీల్లో పట్టణ తరహా సేవలు ప్రజలకు అందించేందుకు కొత్త విధానానికి రూపకల్పనచేసి కేబినేట్ ఆమోద ముద్ర పొందింది. తద్వారా మరింత మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్లస్టర్ వ్యవస్థను రద్దుచేసి గ్రామ పంచాయతీలను స్వతంత్ర ప్రతిపత్తి గల స్థానిక సంస్థలుగా మార్చేందుకు నిర్ణయించింది. దీనిలో భాగంగా పంచాయతీల్లోను, పట్టణ తరహా సేవలు అందించనున్నట్టు ప్రకటించింది. అత్యధిక ఆదాయం, అత్యధిక జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను ఇకపై రూర్బన్ పంచాయతీలుగా మారనున్నాయి. ప్రాథమిక సమాచారం మేరకు జిల్లాలో 18 రూర్బన్ పంచాయతీలను గుర్తించారు. పంచాయతీలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు.. ఇలా జనాభా ప్రాతిపదికన వర్గీకరణ ఉంటుంది. ఇప్పుడు మరో కొత్త వర్గీకరణ ద్వారా పెద్ద పంచాయతీలను ప్రత్యేక కేటగిరీ కింద అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పది వేలమందికిపైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను 'రూర్బన్' పంచాయతీలుగా గుర్తించారు. అదేవిధంగా రూ.కోటికి పైగా ఆదాయం కలిగిన పంచాయతీలు కూడా ఇదే కేటగిరి కిందకు వస్తాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తీసుకున్న నిర్ణయం మేరకు రూర్బన్ పంచాయతీల్లో పట్టణ తరహా సేవలు అందించనున్నారు. పురపాలక సంఘాల మాదిరిగానే రూర్బన్ పంచాయతీల్లో పరిపాలనా విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రణాళిక, ప్రజారోగ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇంజనీరింగ్ విభాగాలు ఏర్పాటుచేసి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించనున్నారు. ఆయా విభాగాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకోవచ్చు. ఇల్లు, భవన నిర్మాణాలకు అనుమతులు, అక్రమ నిర్మాణాల నియంత్రణకు పురపాలక సంఘం మాదిరిగానే కంట్రీప్లానింగ్ విభాగాన్ని ఏర్పాటుచేయనున్నారు. సచివాలయాల్లో అధికంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, రూర్బన్ పంచాయతీల్లో గ్రామీణ ప్లానింగ్ అసిస్టెంట్లుగా నియమించి విధులను అప్పగిస్తారు.



# వచ్చారు.. చూసారు.. వెళ్ళారు..



మీడియాతో మాట్లాడుతున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు

- ప్రమాదం జరిగిన నాటినుండి పలు బృందాల దర్యాప్తు, నివేదికలు
- మళ్ళీ అదే పరిస్థితి లో మరొక దర్యాప్తు జరుగుతోందని ప్రజా సంఘాల ఆరోపణలు
- మీడియా పై అధికారుల ఆంక్షలు
- ప్రమాదంపై నివేదిక ఇస్తామని, పరిహారం ప్రభుత్వం ప్రకటిస్తుందని ప్రత్యేక బృందం వెల్లడి
- పది రోజులు గడిచినా, పదిమందికి అందని పరిహారం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంత ఉరుము, ఉరిమి ఇంతేనా కురిసింది. అనేట్లు కనబడుతోంది ప్రభుత్వ వైఖరి, బాణాసంచా కర్మాగారంలో అక్టోబర్ 08వ తేదీన అగ్నిప్రమాదం సంభవించి, పది మంది మరణించిన ఘటన జరిగి పది రోజులు గడిస్తున్నప్పటికీ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందే నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం మౌనం వహిస్తూ, పలు దర్యాప్తుల పేర కాలయాపన చేయడం పై ప్రజలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరిని నిందిద్దామా? అనే తీరుగా ప్రభుత్వ వైఖరి కనబడుతుందని ప్రజా సంఘాల ఆరోపణలు ఒకవైపు, మానవతా కోణంలో ఆలోచించి పరిహారం అందించాలని వైసీపి కార్యకర్తలు మరొకవైపు, ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు బాధిత కుటుంబాలను మరింత అసహనానికి గురి చేస్తున్నాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం శివారులో బాణాసంచా తయారీ కేంద్రంలో అక్టోబర్ 08 వతేదీన జరిగిన ప్రమాద ఘటనపై దర్యాప్తు నిమిత్తం. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ద్విసభ్య కమిటీ సభ్యులు, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఈగల్ ఐజీ ఆర్.కె. రవి కృష్ణ లు శుక్రవారం రాయవరం చేరుకుని, సంఘటన స్థలాన్ని సందర్శించారు, నష్టపరిహారం పై ప్రకటన విడుదల చేస్తారని, ప్రజాసంఘాలు, బాధిత కుటుంబ సభ్యులు ఆశించగా, పెద్దఎత్తున జిల్లా అధికార యంత్రాంగం తో కలిసి పారదర్శకంగా వ్యవహరించాల్సిన దర్యాప్తు విధానంలో మీడియాను సైతం దూరం పెడుతూ, పెద్ద ఎత్తున విచారణ చేసి ఏదో జరుగుతోందని ఎదురుచూసిన బాధితులను ఉసూరుమనిపించారు. రాయవరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మిక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రమాదానికి గల కారణాలపై సమగ్రంగా విచారణ చేపట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్యాప్తు అధికారి సురేష్ కుమార్ మీడియా తో మాట్లాడుతూ, ఘటన జరిగిన వెంటనే నిర్వహించిన ప్రాథమిక విచారణ నివేదికలను పరిశీలించామని, స్థానిక అధికారులు బాణాసంచా తయారీ కేంద్రం, సంబంధిత భద్రతా ప్రమాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశంపై సంయుక్త తని ఖీలు జరిపి, తగిన లైసెన్సులు, "నో అబ్జెక్షన్ సర్టిఫికేట్" లను గత సెప్టెంబర్ లోనే జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, బాణాసంచా తయారీ ప్రక్రియలో భద్రతా నిబంధనలను పూర్తిగా పాటించారా లేదా అన్న విష యంలో కొన్ని అనుమానాలు ఉన్నాయని, విస్ఫోటనం జరిగిన సమయంలో ఎంత మోతాదులో మందుగుండు సామాగ్రి ఆ ప్రాంతంలో ఉన్నదా? లేదా? అనే దానిపై ఫోరెన్సిక్ నివేదిక రావలసి ఉందని, ఆ నివేదికల ఆధారంగా ఘటనకు గల అసలు కారణాలు స్పష్టమవుతాయని సురేష్ కుమార్ తెలిపారు. ఈ సంఘటనలో మృతి చెందిన బాధితుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందిస్తుందన్నారు. విచారణ పూర్తయిన తర్వాత నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడేందుకు ప్రజాసంఘాలు ప్రయత్నించగా, పోలీస్ శాఖ వారు వారిని అడ్డుకోవడంతో ఉదయం నుండి రాయవరం మండల కార్యాలయాల సముదాయ ప్రాంగణంలోనే ఉండి తమ అభ్యర్థులను స్వీకరించాలని బాధితులకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులతో కలిసి, నినాదాలు చేస్తూ,ప్రజా సంఘాలు




నిరసన చేపట్టగా ఆ సమయంలో అక్కడికి చేరుకున్న రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బాధిత కుటుంబాలు, ప్రజాసంఘాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన పది మంది కి నేటి వరకు కూటమి ప్రభుత్వం ఎక్స్ గ్రేసియా ప్రకటించకపోవడం దారుణమని, ప్రమాదం జరిగి పది రోజులు పూర్తవుతున్నప్పటికీ నేటి వరకు బాధిత కుటుంబాలకు ఒక్క పైసా కూడా సాయం అందలేదని, వీరికి సాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడం కడు శోచనీయమన్నారు. అసలు ప్రమాదం ఏ విధంగా జరిగింది అనే సంఘటనపై శాఖల వారీగా దర్యాప్తు చేసి నివేదికలు అందించిన తర్వాత నష్టపరిహారం ఇస్తామనడం, రెక్కాడితే గాని డొక్కాడని కార్మికులను మరింత వేదనకు గురి చేస్తుందని, గత ప్రభుత్వ హయాంలో పరవాడలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు తక్షణ సహాయార్థమై నష్టపరిహారం గా కోటి రూపాయల చెక్కును గత ముఖ్యమంత్రి అందించారని గుర్తు చేశారు. బాధిత కుటుంబాలను మానవతా హృదయంతో ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని. ఎక్స్గ్రేషియా పంపిణీలో జాప్యం తగదని హితవు పలికారు. ఈ సంఘటనపై రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ ఉన్నత స్థాయి అధికారుల కమిటీ దర్యాప్తు చేపడుతుందని, భాదిత పేద కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకొని వీలైనంత ఎక్కువ మొత్తాన్ని రెండు రోజుల్లో ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, కమిటి సభ్యులను అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కుమారుడు మనోజ్ రెడ్డితో కలిసి డిమాండ్ చేశారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వేగుళ్ళ తెలిపారు. అనంతరం దర్యాప్తు నివేదిక ప్రభుత్వానికి అందిన తరువాత ఎక్స్ గ్రేషియా ప్రకటింపబడుతుందని ద్విసభ్య దర్యాప్తు బృందం తెలపడంతో ప్రజా సంఘాల నాయకులు పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఎం.ఆర్.పీ.ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు దూళి జయరాజ్ మాదిగ, ఏ.ఐ.కెఎం.ఎస్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమ శంకరం, రిపబ్లిక్ పార్టీ ఇండియా నాయకులు కోన లాజర్ ఆవేదన వ్యక్తం చేస్తూ ఉదయం నుండి ప్రత్యేక ఉన్నత అధికారుల బృందం దర్యాప్తు ద్వారా బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ఎదురు చూసామని, ప్రమాదం సంభవించిన రోజు పరిస్థితిని అధికారులతో పాటు, రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత సందర్శించినప్పటి నుండి పలు బృందాలు దర్యాప్తు చేశాయని, ఇప్పుడు కూడా అలాంటి దర్యాప్తు మాత్రమే చేసి పరిహారంపై మాట్లాడకపోవడం ఆవేదన కలిగిస్తుందని ప్రజాసంఘాలు ఆరోపిస్తూ, ఉపాధి హామీ పనులలో ఎవరైనా మరణిస్తే వారి అంతిమ సంస్కారాలకు ప్రభుత్వం కొంతమేర సహాయం అందిస్తుందని కనీసం మానవతా దృక్పథంతో అలాంటి సహాయం కూడా చేయకుండా రెక్కాడితే గాని, డొక్కాడని జీవితాలను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక ఉన్నతాధికారుల బృందంతో, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా, ఆర్డీఓ డి.అఖిల, రామచంద్రపురం డిఎస్పి రఘువీర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ వి.పుల్లారావు, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, జిల్లా అగ్నిమాపక ,విపత్తు నిర్వహణ అధికారి పార్థసారథి, తహసీల్దార్ ఎస్.బి. భాస్కర్, సహాయ కార్మిక కమిషనర్ టీ. నాగలక్ష్మి, రాయవరం ఎస్ఐ సురేష్ బాబు, జిల్లా పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



బాధితులకు న్యాయం చేయాలంటూ ప్రజా సంఘాల ఆందోళన

బత్తుల చేతుల మీదుగా

## ముఖ్యమంత్రి సహాయ నిధులు చెక్కులు పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకున్న పలువురికి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా ముఖ్యమంత్రిగా సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం కోరుకొండకు చెందిన గ్రంధి ప్రసాద్ కి 30వేల రూపాయలు, గంగుల చింతాలకి 40వేల రూపాయలు, కొటికలపూడి సీతారామలక్ష్మికి 50వేల రూపాయల చెక్కును వెంకటలక్ష్మి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. అనంతరం బత్తుల వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెక్కులను అందుకున్న బాధిత కుటుంబాలు శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర,తెలగంశెట్టి శివ, సుంకర శ్రీను, తగరంపూడి గణపతి, పలువురు ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.. : పినిపే




**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ అధ్యక్షతన తాడికోన, గుడాల గ్రామాలలో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి యిజ్రాయిల్, సిఈసి సభ్యులు మాజీ ఎంపీ చింతా అనురాధ పాల్గొన్నారు. కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల నిరుపేదలకు వైద్య విద్యను అందించాలన్న సంకల్పంతో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేసి, వాటిలో ఏడు కాలేజీలను పూర్తి చేస్తే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వారి బినామీలకు ప్రైవేటుపరం చేసి వైద్య విద్యను నిరుపేదలకు అందకుండా చేస్తున్నారని, మెడికల్ కాలేజీ లను ప్రైవేటుపరం కాకుండా ఆపే శక్తి ప్రజాస్వామ్యం లో ప్రజలకు ఉందని వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. కూటమి ప్రభుత్వం కాలేజీల పట్ల చేస్తున్న కుట్రను కోటి సంతకాలతో రాష్ట్ర గవర్నర్ కి తెలియపరుస్తామని అన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ 17 మెడికల్ కాలేజీల్లో ఏడు కాలేజీ నిర్మాణాలు పూర్తి చేసుకుని ఇప్పటికే వైద్య విద్యను అందిస్తున్నారని తెలిపారు. మరో పది కాలేజీలు నిర్మాణంలో ఉన్నాయని. వాటికి రూ.5 వేలు కోట్లు నిధులు అవసరం కాగా కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో అప్పగించడం మెరుగైన వైద్యం పేద ప్రజలకు అందకుండా చేయడమేనని ఆయన అన్నారు. సీఈసీ సభ్యులు, మాజీ ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం ప్రైవేటు కాలేజీలన్ని కుమ్మక్కై పేదప్రజలను దోపిడిచేస్తారని తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి మార్గనిర్దేశంలో కోట సంతకాలు కార్యక్రమాన్ని పూర్తి చేసి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం పీపీపీ విధానంలోని మెడికల్ కాలేజీలకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమిమహేష్, కూడుపూడి భరత్ భూషణ్, వైఎస్సార్సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ. సర్పంచ్ లు రాకాపు విజయలక్ష్మి, బద్రే సీతారత్నం, ఎంపీటీసీలు మాకే కృష్ణమూర్తి, పులుసుగంటి రాజేశ్వరీ, పార్టీ నాయకులు నాతి శ్రీనివాసరావు, ఉంద్రు బాబ్జి, తిక్కా ప్రసాద్, పరమట శ్రీను, దాసరి బాలస్వామి, శిరంగు వీరబాబు,నాగరాజు, ముత్తాబత్తుల సంతోష్, మట్టపర్తి సత్తిబాబు, బడుగు నాగార్జున, బల్ల శ్యామ్,కొనుకు బాబురావు,గోసంగి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## చైనా ఉన్నతిని గుర్తిస్తున్న ప్రపంచం

చైనా, యావత్ ప్రపంచ దేశాలూ అసాధారణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యం లో సి.పి.ఐ(యం) ప్రతినిధి బృందం చైనాలో పర్యటించింది. ఆరుగురు ప్రతినిధులతో కూడిన మా బృందం సెప్టెంబరు 23 నుండి 30 వరకు ఆ దేశ రాజధాని బీజింగ్‌తో పాటు హుబెయీ, ఝెజియాంగ్ ప్రావిన్స్‌లను సందర్శించింది. నేను 40 ఏళ్ళ క్రితం, 1985లో తొలిసారిగా చైనాలో జరిగిన అంతర్జాతీయ యువజన సదస్సుకు హాజరయ్యా ను. ఈ శతాబ్దపు తొలి దశాబ్దంలో మరలా చైనాలో అడుగు పెట్టిన నేను ఆ దేశంలో చోటు చేసుకున్న మార్పులు చూసి ఆశ్చర్యపోయాను. బీజింగ్‌లోని తియాన్మెన్ స్క్వేర్‌లో 'నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్' (జాతీయ కళా ప్రదర్శనా వేదిక) పేరిట భూగర్భంలో నిర్మించిన సాంస్కృతిక రంగస్థల సమాహార వేదిక ఆసియాలోనే అతి భారీ కట్టడంగా పేరొందింది. స్థానికంగా ఈ కాంప్లెక్స్‌ను 'జెయింట్ ఎగ్'గా పిలుచుకుంటారు. అద్భుతమైన శిల్ప కళా నైపుణ్యంతో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో ఒకేసారి నాలుగైదు భారీ ఇవెంట్లు నిర్వహించుకోవచ్చు. మౌళిక సౌకర్యాల అభివృద్ధిలోని సృజనాత్మకత, సాంస్కృతిక వైభవాలకు ఇది అద్దం పడుతుంది. గతంలో పర్యటించినప్పుడు ఇక్కడ చుట్టు పక్కల పరికిస్తూ ఉండిపోయాను. ఈసారి మాత్రం వయోలిన్, గిటార్‌ల వీనుల విందైన కచేరీని అస్వాదించాం. 2021 నాటికి చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్ళు అయ్యింది. ఈ శత వార్షిక సంబరాల్లో భాగంగా చైనా కమ్యూనిస్టు పార్టీ అమలు చేసిన భారీ ప్రజా సంక్షేమ కార్యక్రమాన్ని యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తున్నది. ప్రపంచబ్యాంకు నిర్వచనం ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 80 కోట్ల ప్రజానీకాన్ని చైనా పైకి తీసుకు వచ్చింది. ఈ స్ఫూర్తితోనే కేరళలో సి.పి.ఐ(యం) నాయకత్వాన ఉన్న వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం కూడా దుర్భర దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలను పైకి తీసుకురావడానికి వివిధ అభ్యుదయ కార్యక్రమాలను అమలు చేసిన తీరును గుర్తు చేసుకోవడం సందర్భోచితమని భావిస్తున్నాను. ఈ ఏడాది నవంబర్ నాటికి మన దేశంలో దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలుస్తుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాల సందర్భంగా ఈ ఏడాది జులై 15న బీజింగ్‌లో ఒక మ్యూజియమ్ ఏర్పాటు చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఒక దేశ చరిత్రను, పార్టీ చరిత్రను సునిశితంగా ఎలా ప్రదర్శించవచ్చనే దానికి మ్యూజియమ్‌ను ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చైనా కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన కాలం నుండి ఆధునిక కాలం వరకూ వందేళ్ళ సుదీర్ఘ ప్రయాణంలో సాధించిన విజయాలను కళ్ళకు కట్టినట్లు డిజిటల్ రూపంలో ప్రదర్శించారు. చైనాను సామ్రాజ్యావాద, వలస పాలన నుండి విముక్తి చేసేందుకు సాగించిన పోరాటాన్ని, వివిధ దశలలో అనుసరించిన వ్యూహాలను, ఎత్తుగడలను ఆది నుండి తుది వరకు సచిత్ర రూపంలో ప్రదర్శించారు. మావో జెడాంగ్ నాయకత్వం.. కుమింటాంగ్‌తో పొత్తు, 1927 తర్వాతి కాలం నాటి చీలిక, పోరాటాలు, లాంగ్ మార్చ్, అశేష త్యాగాలు, సమరశీల పోరాటాల ద్వారా సాధించిన విప్లవ విజయం, డెంగ్ జియావో పింగ్ నాయకత్వాన చేపట్టిన ఆధునీకరణ చర్యలు, జియాంగ్ జెమిన్, హుజింటావో నాయకత్వాన కొనసాగిన ఆధునీకరణ పర్వం, 2012 నుండి సీ జిన్‌పింగ్ నాయకత్వాన పార్టీ, దేశం పురోగమిస్తున్న వర్తమాన దశను ఇందులో పొందుపరిచారు. ఈ మ్యూజియంలో 4,548 వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. కార్ల్‌మార్క్స్ బ్రసెల్స్ నోట్‌బుక్, చైనా రిపబ్లిక్‌ను ప్రకటించిన రోజున మావో ధరించిన కోటు, టోపీ, మావో చేతి రాత ప్రతులు, కమ్యూనిస్టు ప్రణాళికను చెన్ వాంగ్టా చైనా భాషలోకి అనువదించిన ప్రతి, లాంగ్ మార్చ్ సందర్భంగా ధరించిన బెల్ట్‌లు, చైనా సైన్యం అమెరికా 31వ పదాతి దళాన్ని ఓడించి కైవసం చేసుకున్న అమెరికన్ జాతీయ జెండా వంటివి చూశాం. మా పర్యటన సందర్భంగా అనేక ద్వైపాక్షిక చర్యలు చోటు చేసుకున్నాయి. అన్నింటిలోకి చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు 'లీ షులేరు' నాయకత్వాన ఉన్న ప్రతినిధి బృందంతో సాగిన చర్యలు ప్రముఖమైనవి. చైనా కమ్యూనిస్టు పార్టీ - సి.పి.ఐ.(యం), ఇరు పార్టీల మధ్య ఉన్న దీర్ఘకాలిక ధృఢ సంబంధాలను కొనసాగించాలన్న అభిప్రాయం ఈ చర్చల్లో వచ్చింది. ట్రంప్ అధ్యక్షతన అమెరికా ప్రపంచ దేశాల మీద, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దక్షిణాది దేశాల మీద తన ఆధిపత్యాన్ని రుద్దడానికి సాగిస్తున్న ప్రయత్నాలను ఇరు పార్టీలూ గమనంలో ఉంచుకుని, ఈ ప్రయత్నాలను నిలవరించడానికి భుజం భుజం కలిపి నిలబడాలన్న ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ సందర్భంగా తియాంజిన్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్స్ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరైన విషయాన్ని గమనంలోకి తీసుకున్నది. భారత్ చైనా దేశాల మధ్య రాయబార సంబంధాలు నెలకొని 75 ఏళ్లు కావొస్తున్న సందర్భం ఇది. షాంఘై కోఆపరేషన్ వేదికతో పాటు బ్రిక్స్ కూటమిలో కూడా రెండు దేశాలూ వాటి వంతు పాత్ర పోషిస్తున్నాయి. రాబోయే కాలంలో భారత్, చైనాలు వంతుల వారీగా బ్రిక్స్ అధ్యక్ష స్థానాన్ని



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# మావోల లొంగుబాటులో భిన్నస్వరాలు



భారతదేశంలో మావోయిస్టు ఉద్యమం దశాబ్దాలుగా రక్తపాతానికి, అస్థిరత్వానికి చిహ్నంగా నిలిచింది. 1967లో నక్సల్‌బరీ తిరుగుబాటుతో మొదలైన ఈ సాయుధ పోరాటం, దేశంలోని అనేక ప్రాంతాలను అస్తవ్యస్తం చేసింది. కానీ, 2025 అక్టోబర్‌లో జరిగిన వరుస సరెండర్లు ఈ ఉద్యమానికి ముగింపు దశ వచ్చినట్టు సూచిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు (అలియాస్ భూపతి, సోనూ) మహారాష్ట్రలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోవడం, ఆయనతో పాటు 60 మంది కేడర్ సరెండర్ చేయడం ఒక మైలురాయి. ఇది కేవలం ఒక సంఘటన కాదు. మావోయిజంలో అంతర్గత విభేదాలు, ప్రభుత్వ ఒత్తిడి, సమాజ మార్పులు అన్నీ కలిసి సృష్టించిన పరిణామమే ఈ లొంగుబాటు. ఈ సరెండర్లు మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బ. కానీ, ఈ లొంగుబాటు దీర్ఘకాలిక ఉద్యమానికి,విరామమా !? లేక వ్యూహాత్మక వెనకడుగా!? అనేది విశ్లేషించాల్సిన అంశం. మల్లోజుల వేణుగోపాల్ సరెండర్ ఒక చారిత్రక సంఘటన. 70 ఏళ్ల వయస్సున్న అగ్రనేత. పార్టీ వ్యవస్థాపక సభ్యుడు. పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు. ఆయన వ్యూహకర్తగా పేరుపొందాడు. రెండు నెలల క్రితం వరకు పార్టీ అధికారిక ప్రతినిధిగా పనిచేశాడు. గడ్చిరోలి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన తుపాకీని సీఎం చేతికి అప్పగించి, రాజ్యాంగాన్ని అందుకున్నాడు. 7 ఏకే-47లు, 6 ఎస్ఎల్ఆర్‌లు, 6 ఇన్సాస్ రైఫిళ్లతో సహా 54 ఇతర ఆయుధాలు ప్రభుత్వానికి అప్పగించారు. ఇది మావోయిస్టు చరిత్రలో మొదటిసారి ఒక సీఎం ముందు అగ్రనేత సరెండర్ అవడం. సీఎం ఫడ్నవీస్ దీనిని "మావోయిజం వెన్ను విరిగింది" అని వ్యాఖ్యానించారు. మిగిలిన కేడర్ కూడా త్వరలో లొంగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో మావోయిజం దాదాపు అంతమైందని, కేవలం ఒక కంపెనీ (10 మంది) తో మాత్రమే మిగిలి ఉందని చెప్పారు. నెల రోజులుగా పోలీసుల సంప్రదింపులు, ఆపరేషన్లు ఈ ఫలితానికి కారణమని పేర్కొన్నారు. ఈ సరెండర్ వెనుక అంతర్గత విభేదాలు స్పష్టం. సెప్టెంబర్‌లో 'అభయ్' పేరిట వచ్చిన లేఖలో మావోయిస్టులు ఆయుధాలు వీడటానికి సిద్ధమని, దీర్ఘకాలిక సాయుధ పోరు పొరపాటని పేర్కొన్నారు. ఒక నెల సీజ్‌ఫైర్ ప్రతిపాదన కూడా చేశారు. ఇది పార్టీలో కలకలం రేపింది. కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణ రెడ్డి (అధికార ప్రతినిధి) దీనిని తప్పుపట్టి లేఖ విడుదల చేశారు. కానీ ఆయన ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. మల్లోజుల పార్టీ వ్యూహంలో లోపాలున్నాయని, తాను భాగస్వామినని పేర్కొంటూ పొలిట్‌బ్యూరో సభ్యత్వానికి రాజీనామా చేశాడు. ఈ లేఖలు సరెండర్‌కు సంకేతాలిచ్చాయి. పోలీసులు ఈ సంకేతాలను పసిగట్టి, వేణుగోపాల్ సోర్స్‌ను పట్టుకుని రాయబారం నడిపారు. ఆయన సీఎం ముందు మాత్రమే సరెండర్ అవుతానని షరతు పెట్టడం గమనార్హం. గతేడాది డిసెంబర్‌లో ఆయన భార్య తారక్క గడ్చిరోలిలో సరెండర్ అయింది. ఇటీవల మల్లోజుల కోటేశ్వరరావు భార్య సుజాత తెలంగాణలో లొంగిపోయింది. కోటేశ్వరరావు 2011లో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. వేణుగోపాల్ ఆయన రెండో అన్న. తెలంగాణకు చెందిన వేణుగోపాల్ లొంగుబాటుకు మహారాష్ట్రను ఎంచుకోవడం ఆసక్తికరం. సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ, మహారాష్ట్ర ప్రభుత్వం సరెండర్ అయినవారికి ఉద్యోగాలు, నివాసం, సదుపాయాలు కల్పిస్తుందని హామీ ఇచ్చారు. లాయిడ్ స్టీల్ కంపెనీ లొంగిపోయిన మావోయిస్టులకు ఉద్యోగాలు ఇస్తుంది, ఇప్పటికే 70 మంది పనిచేస్తున్నారు. తాజాగా సరెండర్ అయినవారికి 6 నెలలు వృత్తి పరంగా శిక్షణ ఇచ్చి, షేర్‌హోల్డర్లుగా చేస్తామని కంపెనీ ప్రతినిధి ప్రభాకరన్ తెలిపారు. ఇది ప్రభుత్వ రీహాబిలిటేషన్ పాలసీల విజయాన్ని సూచిస్తుంది. కానీ విమర్శకులు ఇది తాత్కాలిక ఆకర్షణ మాత్రమేనని అంటున్నారు. లొంగిపోయిన వారు సమాజంలో పూర్తిగా సమైక్యమవుతారా లేక పాత ఇడియాలజీకి తిరిగి వెళ్తారా అనేది ప్రశ్న. వేణుగోపాల్ 45 ఏళ్ల పార్టీ ప్రస్థానం ఆసక్తికరం. 1956లో తెలంగాణ పెద్దపల్లిలో జన్మించిన ఆయన, తండ్రి వెంకటయ్య ప్రభావంతో నక్సల్ బాట పట్టాడు. అన్న కోటేశ్వరరావు (కిషన్‌జీ) తర్వాత పీపుల్స్ వార్‌లో చేరాడు. 1981లో ఫుల్‌టైమర్‌గా అజ్ఞాతంలోకి వెళ్లాడు, 1992లో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రెటరీగా, 2007లో పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎదిగాడు. 2011లో చెరుకూరి రాజ్‌కుమార్ (ఆజాద్) మరణం తర్వాత అధికార ప్రతినిధిగా పనిచేశాడు. తల్లి 2022లో మరణించినా అంత్యక్రియలకు రాలేదు. ఇప్పుడు సరెండర్ చేయడం మావోయిజం ఆదర్శాల ఆచరణలో వచ్చిన మార్పును సూచిస్తుంది. ఈ సరెండర్ తర్వాత వరుస పరిణామాలు జరిగాయి. తెలంగాణలో మావోయిస్టు తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ బండి ప్రకాశ్ (అలియాస్ ప్రభాత్) డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయాడు. 40 ఏళ్లకు పైగా దండకారణ్యంలో ఉన్న ఈ బెల్లంపల్లి వాసి, తీవ్ర అనారోగ్యం కారణంగా పార్టీ వీడాడు. మావోయిస్టు అనుబంధ సంస్థ సింగరేణి కార్మిక సమాఖ్యలో మాజీ కార్యదర్శి అయిన ప్రకాశ్, మల్లోజుల వేణుగోపాల్ ఆయుధాలు వదులుకోవాలన్న వాదనను సమర్థించాడు. ఇది పార్టీలో అనారోగ్యం, వయస్సు సమస్యలు సరెండర్లకు కారణమవుతున్నాయని చూపిస్తుంది. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లో 50 మంది మావోయిస్టులు ఉత్తర బస్తర్ అడవుల నుంచి కాంకేర్ జిల్లాలోని కామ్‌తేరా బీఎస్ఎఫ్ క్యాంపుకు చేరుకున్నారు. వీరిలో డీకేఎస్‌జడ్సీ సభ్యుడు రాజ్‌మన్ (కందగట్ల యాదగిరి), మిలిటరీ చీఫ్ రాజు సలామీ (శివప్రసాద్) సహా 32 మహిళలు ఉన్నారు. 49 ఆయుధాలతో వచ్చిన వీరిలో ఒక రీజనల్ కమిటీ సభ్యుడు, 5 వ, డివిజన్ కమిటీ సభ్యులు, 21 ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సమక్షంలో వీరు సరెండర్ అవుతారని అంచనా. ఆశన్న (తక్కళ్లపల్లి వాసుదేవరావు), రనిత టీమ్ కూడా 50-70 మందితో సరెండర్ అవుతారనే ఊహాగానాలు ఉన్నాయి. ఇది జరిగితే, మావోయిస్టు చరిత్రలో అతిపెద్ద సరెండర్ అవుతుంది, 100-120 మంది లొంగిపోవచ్చు. ప్రధాన మీడియాలో ఈ సరెండర్లపై మిశ్రమ స్పందనలు వచ్చాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా దీనిని "50 ఏళ్ల మావోయిస్టు ఉద్యమం ముగింపు" అని వర్ణించింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ "రాజకీయ-ఆదర్శవాద విజయం" అని పేర్కొంది. హిందూ పత్రిక వేణుగోపాల్ సరెండర్‌ను "పెద్ద దెబ్బ" అని చెప్పింది. ది ప్రింట్ ఆయన టెక్ సావీ, అగ్రనేత అయినా సరెండర్ చేయడాన్ని విశ్లేషించింది. కొంతమంది విమర్శకులు మావోయిజం "మాసెస్ నుంచి అన్యాయం" అని, పార్టీలో వెస్టెడ్ ఇంటరెస్ట్స్ ఉన్నాయని చెప్పారు.సోషల్ మీడియాలో కూడా హల్‌చల్. ఒక పోస్ట్ "మహారాష్ట్ర నక్సల్ ఫ్రీ" అని ప్రశంసించింది. మరొకటి అమిత్ షా వాగ్దానాన్ని గుర్తు చేసింది. కానీ కొన్ని పోస్టులు మావోయిజం ముగియడాన్ని సందేహించాయి, ప్రభుత్వ ఒత్తిడిని విమర్శించాయి. గణాంకాల ప్రకారం, 2025లో 1040 మావోయిస్టులు సరెండర్ చేశారు, గత ఏడాది 881తో పోలిస్తే పెరిగింది.రెండు రోజుల్లో 258 మంది లొంగిపోయారు. మావోయిజం 11 జిల్లాలకు పరిమితమైంది, మూడు మాత్రమే తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లో 836 అరెస్టులు, 1639 సరెండర్లు జరిగాయి. ప్రభుత్వం 2026 నాటికి మావోయిజం అంతం చేస్తామని వాగ్దానం చేసింది. కానీ విమర్శనాత్మకంగా చూస్తే, సరెండర్లు పెరిగినా, మూల కారణాలు (పేదరికం, అసమానతలు) పరిష్కరించకపోతే ఉద్యమం మళ్లీ తలెత్తవచ్చు. అంతర్గతంగా పార్టీ "మాసెస్ నుంచి దూరమైంది" అని వేణుగోపాల్ చెప్పాడు. రీహాబిలిటేషన్ పాలసీలు బలోపేతం చేయాలి. లేకపోతే ఇవి తాత్కాలిక విజయాలుగా మిగిలిపోతాయి.

# జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి

ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డు పొందిన మూడో తెలుగు రచయిత రావూరి భరద్వాజ. ఆయన కన్నా ముందు ఈ అవార్డు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు, డాక్టర్ సి. నారాయణరెడ్డికి ఈ అవార్డు లభించింది. భరద్వాజ 2011లో త్రిపురనేని గోపీచంద్ పురస్కారాన్ని, 2009లో లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, 2012లో జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్నారు.రావూరి భరద్వాజ (జూలై 5, 1927- (అక్టోబరు 18, 2013) తెలుగు లఘు కథా రచయిత, నవలా రచయిత, రేడియోలో రచయితగా పేరు తెచ్చు కున్నారు. గొప్ప భావుకుడైన తెలుగు కవి, రచయిత. రావూరి భరద్వాజ 37 కథా సంపుటాలు, 17 నవలలు, 6 బాలల మినీ నవలలు, 5 బాలల కథా సంపుటాలు, 3 వ్యాస, ఆత్మకథా సంపుటాలు, 8 నాటికలు, ఐదు రేడియో కథానికలు రచించారు. ఈయన బాల సాహిత్యంలో కూడా విశేషకృషి సలిపారు. సినీ పరిశ్రమలో తెరవెనుక జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రీకరించిన పాకుడు రాళ్ళు నవల భరద్వాజ యొక్క ఉత్కృష్ట రచనగా పరిగణింపబడుతుంది. ఆయన రచనలలో జీవన సమరం మరో ప్రముఖ రచన. తెలుగు రచనా ప్రపంచంలో వినూత్న సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనుడాయన. ఆడంబరాలు లేని సాధారణ జీవితం ఆయనది. భరద్వాజకు దిగువ మధ్యతరగతి, పేదప్రజల భాషపై గట్టిపట్టు ఉంది. ఒక బీద కుటుంబంలో జన్మించిన భరద్వాజ కేవలం ఉన్నత పాఠశాల స్థాయి వరకే చదువు కున్నారు. ఆ తరువాత కాయకష్టం చేసే జీవితాన్ని ప్రారంభించారు. చిన్న తనంలో పొలాల్లో గడిపిన భరద్వాజ వ్యవసాయ కూలీల కఠినమైన జీవన పరిస్థితులను గమనించే వారు. అప్పుడే పల్లె ప్రజల భాష, యాస, ఆవేశాలు, ఆలోచనలు, కోపాలు, తాపాలు గమనించిన భరద్వాజ ఆ అనుభవాలను తర్వాత కాలంలో తన రచనలలో నిజమైన పల్లె వాతావరణాన్ని సృష్టించడానికి ఉపయోగించుకున్నారు. 2013 అక్టోబరు 18న రావూరి భరద్వాజ తిరిగిరాని లోకాలకు తరలి వెళ్ళారు. రావూరి 1927 జూలై 5వ తేదీన కృష్ణా జిల్లా లోని నందిగామ తాలూకా కంచికచర్ల సమీపంలోని మోగులూరు (నాటి హైదరాబాదు సంస్థానంలోని) గ్రామంలో రావూరి కోటయ్య, మల్లికాంబ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం 8వ తరగతి వరకే సాగింది. తొలి నాళ్ళలో రావూరి భరద్వాజపై చలం ప్రభావం ఎక్కువగా ఉండేది. యుక్త



వయసులోనే తెనాలిచేరి అక్కడ ఒక ప్రెస్సులో పనిచేయటం ప్రారంభించారు. 1946లో నెల్లూరులోని జమీన్ రైతు వారపత్రిక సంపాదక వర్గంలో చేరారు.1948లో దీనబంధు వారపత్రికకు బాధ్యులుగా ఉన్నారు. జ్యోతి,సమీక్ష, అభిసారిక, చిత్రసీమ, సినిమా, యువ పత్రికల్లో 1959వరకు కొన్నాళ్ళు ఫౌంటెన్ పెన్నుల కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేశారు. అక్కడ యజమాని అమానుషత్వాన్ని భరించలేక రాజీనామా చేసి కొన్నాళ్ళపాటు ఖాళీగా ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాదు ఆకాశవాణి కేంద్రంలో 1959లో ప్రూఫ్ రీడింగ్ కళాకారునిగా చేరి చివరకు 1987లో ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీ విరమణ చేశారు. రావూరి భరధ్వాజ గురించి చాలాకాలం పరిశోధన చేసి, రచనల గురించి సమగ్రమైన పరిశీలన చేసిన బొగ్గుల శ్రీనివాస్ ప్రకారం భరధ్వాజ సుమారు 187 పైగా పుస్తకాలను వెలువరించారు, 500 పైగా కథలను 37 సంకల నాలుగా, 19 నవలలు, 10 నాటకాలు వ్రాశారు. భరద్వాజ తన తొలి కథ ఒకప్పుడును 16 ఏళ్ల ప్రాయంలో వ్రాశారు. ఇది జానపద శైలిలోసాగే కథ. భరద్వాజపై చలం ప్రభావం మెండుగా ఉంది. చలాన్ని అనుకరిస్తూ ఈయన అనేక సెక్సు కథలు వ్రాశారు. త్వరలోనే సెక్సు కథలు వ్రాయటంలో అందెవేసిన చెయ్యి అనిపించు కున్నారు. అనేక పత్రికలు ఆ వ్యాసంగంలో ఈయన్ను ప్రోత్సహించాయి. ఏ మాత్రం సంకోచం, జంకు లేకుండా జీవనోపాధికై ఆయన అనేక కథలు వ్రాశారు. 1983లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. నాలోని నీవు, అంతరంగిణి, ఒక ఏకాంతం, ఒకింత వేకువ కోసం వంటి కవితా సంకలనాలు రచించారు. భరద్వాజ రచించిన కౌముది, హిందీ, గుజరాతీ భాషల్లోకి అనువాద మైంది. ఆత్మగతం, బానుమతి, దూరపు కొండలు, జీవనాడి, మనోరత్నం, నీరు లేని నది, సశేషం, స్వప్న సీమలు, స్వర్ణ మంజరి వంటి 11 నాటకాలు రచించారు. బాల సాహిత్యానికి సంబంధించి 33 పుస్తకాలు రచించారు. పిల్లల కోసం ఏడు నవలలు రాశారు. విచిత్రమైన మానవ భావోద్వేగాలే ప్రధానాంశాలుగా కథలు వ్రాసే భరద్వాజ శైలిసరళమైనది. పాత్ర చిత్రీకరణలో, ఒక సన్నివేశాన్ని పరిచయం చేయటంలో రావూరి భరద్వాజకు ఉన్న ప్రజ్ఞ అద్భుతమైనది. రావూరి భరద్వాజ పేరు ప్రఖ్యాతులు తెచ్చిన రచనల్లో ముఖ్యమైనది, చలనచిత్ర పరిశ్రమను వస్తువుగా చేసుకొని తెలుగులో వెలువడిన మొట్ట మొదటి నవల పాకుడు రాళ్లు. భరద్వాజ దీనికి మాయ జలతారు అని నామకరణం చేశారు. అయితే శీలా వీర్రాజు పాకుడురాళ్లు అనే పేరు పెట్టాడు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ముదిగొండ సుబ్రహ్మణ్య శర్మల ప్రోత్సాహంతో రావూరి భరద్వాజ తాను అంతకు ముందే రాసిన 'పాలపుంత' అనే ఓ పెద్ద కథని పాకుడురాళ్లు నవలగా రాశారు. మూడు సంవత్సరాల పాటు కృష్ణా పత్రికలో ధారావాహికగా వెలువడిన పాకుడురాళ్లు నవలపై శ్రీకృష్ణదేవ రాయ, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరగడం విశేషం. రావూరి భరద్వాజకు 1980లో ఆంధ్ర విశ్వ విద్యాలయం, 1987లో జవర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం, 1991లో నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసి గౌరవించాయి. 1980లో కళాప్రపూర్ణ - ఆంధ్ర విశ్వవిద్యాలయం,1983లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 1985లో సోవియట్ భూమి నెహ్రూ పురస్కారం ఇనుక తెర వెనకకు లభించింది. 1987లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు,1987లో తెలుగు కళాసమితి కె.వి.రావు, జ్యోతిరావు అవార్డు, 1997లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాహిత్యలో విశిష్ట పురస్కారం, 2007లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళారత్న అవార్డు, 2008లో లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం, (వినూత్న సాహితీ ప్రక్రియ కల్పించినందుకు, డిసెంబరు 4 వ తేదీన ప్రకటించారు), 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ, వంగూరి ఫౌండేషన్, గోపీచంద్ జాతీయ సాహిత్య పురస్కారాలు లభించాయి. 2012లో జ్ఞానపీఠ అవార్డు తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన బహుముఖమైన కృషికి దక్కింది.

### సూర్య ఘర్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ద్వారా

# చార్జీలు తగ్గి సంస్థలు ఆర్థికంగా బలపడతాయి : కలెక్టర్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పురపాలక సంఘాలలో 'సూర్యఘర్' పథకంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల సంస్థాపన ద్వారా విద్యుత్ చార్జీలు గణనీయంగా తగ్గి, స్థానిక సంస్థలు ఆర్థికంగా బలపడతాయని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన నడిపూడి సమ్మర్ స్టోరేజ్ చెరువు వద్ద ప్రతిపాదిత సోలార్ ప్లాంట్ స్థలాన్ని మున్సిపల్, విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థలకు ఆర్థిక సౌలభ్యం కలిగించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు సౌర విద్యుత్ దోహదపడు తుందని చెప్పారు. సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ యూనిట్లు అమలు చేస్తే నెలవారీ విద్యుత్ బిల్లులు ఎక్కువగా తగ్గుతాయని, అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే అవకాశం ఉండి ఆదాయం కూడ సాధ్యమ వుతుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, అందువల్ల ప్రారంభ పెట్టుబడి భారం తక్కువవుతుందని తెలిపారు. సోలార్ ప్లాంట్లు 20-25 సంవత్సరాల ఆయుష్షు కలిగి తక్కువ నిర్వహణతో పనిచేస్తాయని చెప్పారు. మున్సిపల్ కార్యా లయాలు, వీధి విద్యుత్, ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ వినియోగించడం ద్వారా వార్షిక విద్యుత్ ఖర్చులను భారీగా తగ్గించుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. వేగవంతమైన అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా సబ్సిడీలు మరియు బ్యాంకు రుణాలు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. నీటి పంపులు, డ్రైనేజ్ వ్యవస్థలు, మరి యు నీటి సరఫరా వంటి కీలక సేవలకూ సోలార్ శక్తి వినియోగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. దీని ద్వారా విద్యుత్ సరఫరా అంతరాయాలు తగ్గి, కాలుష్య నిరోధం, ఆర్థిక స్థిరత్వం, మరియు పర్యావరణ హిత అభివృ ద్ధికి మార్గం సుగమమవు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్ మాట్లాడుతూ, సోలార్ ప్లాంట్ల సంస్థాపన పురపాలక సంఘాలకు విద్యుత్ ఖర్చులలో భారీ ఉపశమనాన్ని ఇస్తుందని చెప్పారు. పర్యావరణ, ఆర్థిక, సామాజిక రంగాల్లో ఈ చర్య లాభదాయకమని అన్నారు. గ్రీన్ సిటీస్ మరియు స్మార్ట్ సిటీస్ లక్ష్యాలను చేరుకోవడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ సూపరిం టెండెంట్ ఇంజనీర్ బి. రాజేశ్వరి, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులు విద్యాబోధనలో

# కీలక భూమిక పోషించాలి : జెసి నిషాంతి

## జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సలీం భాష అధ్యక్షతన కలెక్టరేట్లో నూతన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నూతనంగా నియమితు లైన ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధికి మౌలిక సదుపా యాలు కల్పనకు నాణ్యమైన విద్యాబోధన వంటి లక్ష్యాలలో కీలక భూమిక పోషించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు మెగా డీఎస్సీ 2025లో నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి పరిచయ కార్యక్రమం డీఈవో అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుల జీవితంలో నేడు ఒక మైలురా యని ఈరోజు నుండి గుణాత్మక విలువలు నాణ్యమైన విద్యా భ్యాసన ద్వారా మన జిల్లాను విద్యా రంగంలో రాష్ట్రస్థాయిలో అగ్ర బాగాన నిలపాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థినీ విద్యార్థులకు నైతిక విలువ లుతో కూడిన ఉన్నత విద్యా భ్యాసం చేపట్టి ఉన్నత శిఖరాలు అధి రోహించేలా కీలక భూమిక పోషించాలన్నారు జిల్లా స్థాయి లో సమగ్రంగా విద్యా ప్రమాణాలను ఆధునిక సాంకేతికతతో జోడించి ఉత్తమ భావి భారత పౌరులను తీర్చిదిద్దాలని నూతన ఉపాధ్యా యులకు పిలుపు నిచ్చారు. కొత్తగా నియమితులై పదవీ బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు విద్యా భివృద్ధికి ప్రధాన ప్రేరణగా ఈ పరిచయవేదిక నిలుస్తుందన్నా రు.తరగతి గదిలో విద్యార్థులు చురు కుగా పాల్గొని విద్యను నేర్చుకునేలా విద్యాభ్యాసన పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. విద్యార్థిని విద్యా ర్థులలో ప్రశ్నిం చే తత్వాన్ని ఆలోచన జ్ఞానాన్ని అలవర్చాలన్నారు. తద్వారా విశ్లేషణా సామర్థ్యం మెరుగుప డుతుందన్నారు. పాఠ్య ప్రణాళిక, బోధనా వ్యూహాల ప్రణాళికలతో ఉత్తమ విద్యా ప్రమాణాలు అల వర్చాలన్నారు. ప్రతి పాఠానికి స్పష్టమైన లెర్నింగ్ అవుట్ కమ్స్ ఉండేలా పాఠ్య ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు పాఠశాల విద్యా క్యాలెండర్‌ను అనుసరించి సమగ్రమైన విద్యా బోధన ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ టూల్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వనరులను బోధనలో విని యోగిస్తూ మెరికల్లాంటి భావి భారత పౌరులను తీర్చిదిద్దాలన్నారు. ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫార్ములు విద్యార్థుల ఆసక్తిని పెంచుతా యన్నారు. క్లాస్‌రూమ్ మేనేజ్‌మెంట్ విద్యార్థి అభివృద్ధికి తోడ్పడేలా పాటుపడాలన్నారు. క్రమశిక్షణా వాతావరణం ప్రోత్సాహక తరగతి వాతావరణం కనిపిం చాలన్నారు. ఆర్డీవో కే.మాధవి వ్యక్తిగత విద్యార్థి అభిరు చులు, సామర్థ్యాల ను గుర్తించి మార్గ నిర్దేశం చేయాలన్నారు. తల్లి దండ్రుల సమావేశాలు నిర్వ హించి విద్యార్థుల విద్యాభ్యాస పురోగతిపై పరస్పర చర్చలు సాగించాలన్నారు. ఇది పాఠ శాల-తల్లిదండ్రుల అనుబం ధాన్ని బలోపేతం చేస్తుంద న్నారు. వినూత్న బోధనా వ్యూహాలు, పరిశోధన పద్ధతులు అవలంబింపజేయాలన్నారు. శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని నైపుణ్యాలను నిరంతరం నవీకరించాలన్నారు. విద్యార్థుల్లో జాతీయ విలువలు, సామాజిక బాధ్యతా గుణాలు పెంపొందించేలా తర్ఫీదును ఇవ్వాలన్నారు. పాఠశాల పరి శుభ్రత, పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థుల భాగ స్వామ్యాన్ని పెంచాలన్నారు. బాల బాలికలలో అభ్యసన సంస్కృతినీ అలవర్చేలా, ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత విద్యా నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకోవాలన్నారు. వర్క్‌షాపులు, వెబినార్లు, శిక్షణా తరగతుల్లో పాల్గొనడం ద్వారా నూతన పద్ధతులు నేర్చుకుని ఆధునిక యుగానికి తగినట్లుగా విద్యాబోధన చేయాలని సూచించారు. ఆధునిక యుగంలో ఉపాధ్యాయుల పాత్ర బహుముఖంగా, సమాజం మారుతున్న అవసరాలకు అనుగుణంగా విస్తరించిందన్నారన్నారు. ఉపాధ్యాయుడు కేవలం బోధకుడు మాత్రమే కాకుండా మార్గదర్శి, సాంకేతిక నిపుణుడు, సామాజిక మార్గనిర్దేశకుడు వ్యక్తిత్వ వికాసానికి ప్రేరకుడిగా ఉపాధ్యాయులు మారాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష ప్రసంగిస్తూ ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పే వాడి పాత్రలో లేకుండా విద్యా ర్థులు స్వ తంత్రంగా ఆలోచించేలా స్ఫూర్తి కలిగించే మార్గదర్శిగా ఉండాలన్నారు. ప్రాజెక్ట్ ఆధారిత, అనుభవాధారిత పాఠాలు ఇవన్నీ ఆధునిక విద్యకు మూలమన్నారు. డిజిటల్ యుగంలో ఉపా ధ్యాయులు స్మార్ట్ బోర్డులు, ఆన్‌లైన్ కోర్సులు, యాప్‌లు, వీడియోల ద్వారా బోధనను మరింత అర్థవంతంగా చేయడం నేర్చుకోవాలన్నారు. టెక్నాలజీ పట్ల అవగాహన, దానిని సమర్థంగా విని యోగించే సామర్థ్యం ఇప్పుడు ఒక ఉపాధ్యా యునికి తప్పని సరన్నారు నైపుణ్యం సృజనాత్మకత ఆలోచనా స్వేచ్ఛ ఆధునిక ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు ప్రశ్నలు అడగడం, ప్రయోగాలు చేయడం, తమ అభిప్రా యాలు వ్యక్తపరచడం ప్రోత్సాహించా లన్నారు. ఈ ప్రక్రియ విమ ర్శాత్మక ఆలోచనకు పునాది వేస్తుందన్నారు. సామాజిక బాధ్యత విలువల బోధన తరగతి గదిలో మాత్రమే కాకుండా సమాజానికి ఉపాధ్యాయుడు తార్కికత, నైతికత, దేశభక్తి విలువలను బోధించే బాధ్యత కూడా వహించాలన్నారు. పౌర విలువలు, పర్యావరణ అవగాహన, సామాజిక ఐక్యత వంటి అంశాలలో ఉపాధ్యాయుని పాత్ర మరింత ప్రాము ఖ్యాన్ని పొందిందన్నారు. విద్యా శాఖ ఆర్జెడి జీ.నాగమణి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఉపాధ్యాయుడు కూడా నిరంతరం నేర్చుకోవడం, సాంకేతికతకు అప్ డేట్ కావడం అత్యవసరమ న్నారుఆధునిక ఉపాధ్యా యుడు సమాజ నిర్మాణంలో కీలక స్తంభమని, బోధ కుడిగా మాత్రమే కాకుండా ప్రేరణదాత, మార్గదర్శకుడు, సాంకేతిక మార్పుల మధ్య దారి తప్పకుండా నడిపే జ్ఞానపూర్ణ నాయ కుడిగా ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసి జి.మమ్మీ, జిల్లా ఉప విద్యా శాఖ అధికారి జి.సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎంపీ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం అమలాపురం పార్ల మెంటు సభ్యులు గంటి హరీష్ మధుర్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

## కోనసీమ తిరుపతి వెంకన్నను దర్శించుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు 8వ రోజు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుని అభినందనలు తెలిపారు అనంతరం ఆలయ అర్చకులు వేదాశిర్వచినలు ఇచ్చరు ఆలయ డిప్యూటీ కమీషనర్ నల్లం సూర్య చక్రధరరావు స్వామి వారి చిత్రపటం అందజేశారు.

### అనంత కుమారికి శాలివాహన ఫెడరేషన్ చైర్మన్

## ఈశ్వర్ అభినందనలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ ఆంధ్రప్రదేశ్ బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారిని కలిశారు. కొత్తపేటలోని ఆమె స్వగృహం నందు ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా అనంత కుమారి కి ఈశ్వర్ ఘనంగా అభినందనలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందించడంతో పాటు శాలువాతో సత్కరించి, పదవీ బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో బీసీ వర్గాల ఆర్థిక సాధికారత, ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు చేయాల్సిన సంక్షేమ కార్యక్రమాలపై వారు క్లుప్తంగా చర్చించారు. అనంతరం, పేరేపి ఈశ్వర్ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యంని కలిసి అభినందనలు తెలిపారు. వారికి పుష్పగుచ్ఛం అందించి, రాష్ట్రంలో బీసీ వర్గాల సంక్షేమం, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన ఫెడరేషన్ తరఫున ఆచార్య కళారత్న డి.రాజ్ కుమార్ వుడయార్, డైరెక్టర్లు మాచవరపు విజయ కుమారి, పందూరి అప్పారావు, కోడెటి లక్ష్మీ కనకదుర్గ, మంతెన సత్యసాయిబాబా, దేవగుప్తాపు నాగేంద్ర, మండేపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రావులపాలెం బస్టాండ్ అభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం బస్టాండ్ అభి వృద్ధి, వాడపల్లి బస్టాండ్ నిర్మాణానికి తీసుకోవలసిన చర్యలపై ఎమ్మెల్యే బండారు ఆర్టీసీ అధికారులతో చర్చిం చారు. శుక్రవారం ఆర్టీసీ రీజనల్ మేనే జర్ రాఘవ కుమార్, డిపో మేనేజర్ జి.వి.వి.ఎన్ కుమార్ రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారును కలిశారు. వాడపల్లిలో భక్తుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మాణానికి మూడు ఎకరాల స్థలం కేటాయించాలని ఆయన ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కోరారు. వాడపల్లి లో బస్టాండ్ నిర్మాణం తో పాటు వాడపల్లి వచ్చే భక్తుల సౌకర్యార్థం అదనపు బస్సులు కేటాయించాల్సిందిగా మరియు రావులపాలెం బస్టాండ్ ఆధునికరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. ప్రయాణికులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు.

### ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందించిన

# వైసీపీ నేత రమణారావు



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న బాధి తురాలుకి అవసరమైన ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు గుడ్ సీడ్ ఫౌండేషన్, మిరాకిల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సమకూర్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లికు చెందిన ఎలిపే మోహన్ రావు భార్య ఎలిపే మంగదేవికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అవసరం ఏర్పడింది. ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగా ఉన్న మంగాదేవి సమస్యను పలువురు ద్వారా రమణారావు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రమణారావు శుక్రవారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ టీమ్ సభ్యుల ద్వారా మంగాదేవికి అవసరమైన ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను ఆమే భర్త మోహన్‌రావుకు అందజేశారు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను సమకూర్చిన గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావుకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, పందిరి సుబ్బరాజు, నేరేడుమల్లి శ్రీను, ముత్తాబత్తుల గణేష్, విప్పర్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రావులపాలెంలో బీజేపీ మండల కమిటీ సమావేశం

## పార్టీ సమావేశంలో ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్, నూతన జీఎస్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న నాయకులు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వదేశి వస్తువులను కొనుగోలు చేసి స్వదేశీ ఉత్ప త్తులనే ప్రోత్సహించాలని బీజేపీ నేతలు అన్నారు. భారతీయ జనతా పార్టీ రావులపాలెం మండల అధ్యక్షులు కొవ్వూరి వెంకట కృష్ణారెడ్డి అధ్యక్షతనతో గురువారం ఆయన స్వగృహం వద్ద బీజేపీ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి స్వామి ముఖ్య అతిధిగా విచ్చేశారు మండలంలోని ఈతకోట గ్రామానికి చెందిన మండవిల్లి సతీష్ బీజేపీలో చేరారు ఆయనకు పార్టీ కండువా వేసి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి స్వామి.కొత్తపేట అసెంబ్లీ కో-కన్వీనర్ ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ రావులపాలెం మండల కన్వీనర్లు గండ్రోతు వీరగోవిందరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో చేపట్టిన ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌ని ప్రజల్లోకి తీసుకెళ్ళలన్నారు దేశంలో తయారవుతున్న స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే ఆ పరిశ్రమల అభివృద్ధి సాధిస్తాయని తద్వారా సమాజంలో అనేకమందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడి ప్రతీ ఇంట స్వదేశీ ఇంటింటా స్వదేశీతో దేశం అభివృద్ధిపథంలో నడుస్తుందన్నారు కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ ఫలాలు ప్రతీ ఒక్కరికి అందాలంటే అవగాహనా అవసరమన్నారు జీఎస్టీ సంస్కరణలతో అన్ని రంగాలకు లబ్ధిచేకురేలా ఎన్డియే ప్రభుత్వం జీఎస్టిని తగ్గించిందన్నారు జీఎస్టీ 2.0 రాక ముందు వచ్చిన తర్వాత వస్తువుల ధరలను పరిశీలించాలన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు నందం శ్రీలక్ష్మి, మండల ప్రధానకార్యదర్శి మంచిగంటి కృష్ణ, మద్దింశెట్టి శ్రీనివాస్, కంకటాల వెంకటరత్నం (నాని), బోర్రా ఆంజనేయులు, బుజ్జి, శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణదేవరాయుల పాలన స్వర్ణయుగం : ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయుల పాలన స్వర్ణయుగమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయుల 496వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో ప్రజల మన్ననలు పొందిన గొప్ప చక్రవర్తులలో శ్రీకృష్ణదేవరాయులు ఒకరన్నారు. ఆయన పాలనా కాలంలో ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో జీవించారని వ్యాఖ్యానించారు. ఆయన కాలంలో రత్నాలు, వజ్రాలు బజార్లలో రాశులుగా పోసి అమ్మేవారని చరిత్ర చెబుతుందన్నారు. తెలుగు భాషకు ఆయనచేసిన సేవ చిరస్మరణీయమన్నారు. తన పాలనతో స్వర్ణ యుగాన్ని సృష్టించిన శ్రీకృష్ణదేవరాయులు మనందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రావులపాలెంలో శ్రీ కృష్ణ దేవరాయల కాంస్య విగ్రహం ఏర్పాటుకి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, నందం సత్యనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్‌గా తహశీల్దార్‌గా రాజేశ్వరరావు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం తహశీల్దార్‌గా పనిచేయుచున్న టి.రాజేశ్వరరావు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందియున్నారు. వీరిని కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్ ఆర్.డి.రామచంద్రమూర్తి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం.భాను, కార్యాలయ సిబ్బంది మరియు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్‌లు, రేషన్ షాపు డీలర్లు అభిమానులు అభినందించారు.



# శ్రీసత్యదేవుని మాల ధారణా దీక్షలు ప్రారంభం

## రత్నగిరీశుడికి జన్మనక్షత్ర పూజలు - 108 స్వర్ణ పుష్పాలతో అర్చన





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి సత్య ధీక్షా మాల ధారణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర కార్తీక మాసంలో సత్యదేవుని మాల ధారణ ఎంతో విశిష్టమైనది కావడంతో వేలాది మంది భక్తులు సత్య దీక్షలను చేపట్టి స్వామి కృపాకటాక్షాలను పొందడం ఓ సత్సంప్రదాయంగా వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఈ దీక్షలను భక్తులు తీసుకున్నారు. ఈ సత్య దీక్షల మాల ధారణ చేసే భక్తులకు శ్రీ స్వామి వారి దర్బార్ మండపంలో అనువైన ప్రత్యేక ఏర్పాట్లను దేవస్థానం అధికార్లు చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించి, దీక్షలను స్వీకరింప చేసారు. దీక్షాపరులకు సత్య దీక్ష మాలలు, వస్త్రాలు, పూజా విధి విధాన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ దీక్షలను ఈ శుక్రవారం నుంచి వచ్చే నవంబర్ నెల 13 వ తేదీ వరకూ 27 రోజుల పాటు అత్యంత భక్తి, శ్రద్ధలతో ఆచరించాలని భక్తులకు సూచించారు. అనివార్య కారణాల వలన 27 రోజుల దీక్షా వ్రతం చేపట్టడం కుదరని వారికి 18 రోజులు పాటు, ఇది కూడా వీలుకాని వారికి 9 రోజుల దీక్షలు కూడా చేపట్టే అవకాశం ఉందని దేవస్థానం వైదిక కమిటీ సభ్యులు తెలిపారు. సత్యదేవుని జన్మ నక్షత్రం మఖ సందర్భంగా గర్భాలయంలోని శ్రీ స్వామి అమ్మ వార్లను శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటలకు ఆలయ వేద పండితులు, ప్రధాన అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొల్పారు. తదుపరి అభ్యంగన స్నానం ఆచరింపజేసి అనంతరం మహన్యాస రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి నూతన పట్టు వస్త్రాలు ధరింపజేసి, వివిధ రకాల సుగంధ భరితమైన పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం భక్తులకు ఏడు గంటలకు శ్రీ స్వామి అమ్మ వారిని శివకేశ్వరుడు దర్శన భాగ్యం కల్పించారు. పిదప ఏకాదశి కావడంతో శ్రీ స్వామి అమ్మ వారికి 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీ స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా శ్రీ స్వామి అమ్మ వారి పేర్ల మీద ఆయుష్ హెరీమం నిర్వహించారు. అలాగే అశ్వీజ బహుళ దశమి, ఏకాదశి, శ్రీ స్వామి వారి జన్మ నక్షత్రం మఖ కలిసి రావడంతో ఆలయానికి శ్రీ స్వామి వారి దీక్షలు తీసుకునే స్వాములు, భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు, సత్య దీక్షాపరులకు శ్రీ స్వామివారి నిత్య అన్నదాన ప్రసాదం పథకంలో అన్న ప్రసాదం వితరణ గావించారు. ఈ సత్యమాల దీక్షలు స్వీకరణ, శ్రీ స్వామివారి జన్మ నక్షత్ర పూజా కార్య క్రమాల్లో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీర్ల సుబ్బారావు, వేద పండితులు, ప్రధాన అర్చకులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### దసరా ఉత్సవాలలో జరిగిన ఘటన

# సొమ్ము ఒకరిది.. పేరు ఒకరిది...



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సిటీలో గల దుమ్ములపేట ఏరియాలో రాజీవ్ గృహకల్ప వద్ద శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి 16వ వార్షికోత్సవంను తెలుగుదేశం పార్టీ నాయకురాలు 11వ వార్డు 86వ బూత్ కన్వీనర్ నులుకుర్తి లోవ లక్ష్మి ఆమె భర్త ధనరాజు 10 వ వార్డు ఇంచార్జ్ తిరిది ఎల్లమ్మ సమక్షంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆశీస్సులతో దసరా 11 రోజులు జరిగిన ఉత్సవాలలో అంగరంగ వైభవంగా ప్రతిరోజు ఏదో ఒక కార్యక్రమంతో సొంత నిధులతో ఘనంగా జరిపించారు. సుమారుగా 200 మంది అమ్మవారు భక్తులతో కళాశాల ఊరేగింపు జరిపించారు. సుమారుగా 2000 మందికి పైగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నాయకురాలు నులుకుర్తి లోవ లక్ష్మి మాట్లాడుతూ మేము కష్టపడి దసరా ఉత్సవాలు జరిపించాం. కానీ కొంతమంది వ్యక్తులు పబ్లిసిటీ కోసం వాళ్ల పేర్లు పేపర్లలో వేయించుకోవడం జరిగింది. వాళ్ళు ఎవరు ఈ ఉత్సవానికి ఒక్క రూపాయి కూడా సహాయం చేయలేదు అని, పైగా అమ్మవారు గుడి కడుతున్నామని జనాలను మోసంచేస్తున్నారు. కాకినాడ సిటీ ప్రజలు, ఇది గమనిస్తారని, అమ్మవారు గుడి కట్టేటప్పుడు మేమే దాతలు వద్దకు వస్తామని పత్రికా ముఖంగా మీకు తెలియజేస్తున్నాను. దసరా ఉత్సవాలలో మా వెన్నంటే ఉండి మమ్మల్ని ప్రోత్సహించినటువంటి గుడ్ల శ్రీనివాసరావు, ఎం పాడి చిట్టి, భాగ్య దుర్గారావు, వైద్య రాజు లోవరాజు, రామకృష్ణ వేణి, వీరవరపు కార్తీక్, వి.గణేష్, తదితరులు అందరికీ ధన్యవాదములు తెలిపారు.

### రాజకీయాల్లో యువత భాగస్వామ్యానికి

# జనసేనాని ఆహ్వానం...!




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యాధికారంలో భాగస్వామి అయిన జనసేన పార్టీ ఇటీవల కాలంలో పార్టీని పునర్నిర్మించడం, మరింత బలపరచడం, రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతం చేయడంపై ఆ పార్టీ జనసేనాని కొణిదెల పవన్ కల్యాణ్ ఇటీవల కాలంలో బాగా దృష్టి సారించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పార్టీ పదవులను ఒక్కొక్కటిగా వీలు వెంబడి కట్టబెడుతూ వస్తున్నారు. పార్టీని బలపెట్టేందుకు ఇదొక్కటే చాలదని ఆయన బాగా తెలుసు. అందుకే ఓ సరికొత్త ఆలోచన చేసారు. ప్రస్తుతం రాజకీయ వ్యవస్థలో నవతరం యువత కొరతగా ఉన్న విషయాన్ని గ్రహించిన పార్టీ ఆ వర్గం యువతకు వల విసిరే ప్రయత్నం చేస్తోంది. అందుకు సేనతో సేనాని - మన నేల కోసం కలిసి నడుద్దాం' అంటూ ఓ కొత్త నినాదాన్ని శుక్రవారం ప్రజా బాహుళ్యం లోనికి విరివిగా తెచ్చారు. దీని విధి విధానాలు పూర్తిగా బహిర్గతం కాలేదు. అయితే ఆ ప్రకటనను మాత్రం జనసేనాని బహిర్గతం చేశారు. నేటి రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సమాజంలో మార్పును కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలను మాతృ భూమికి అందించే అవకాశం కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు పవన్ కల్యాణ్. ఇందులో భాగంగా 'సేనతో సేనాని - మన నేల కోసం కలిసి నడుద్దాం' అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన నిర్వహించ నుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించ నుందని తెలిపారు. మార్పు కోరుకుంటే రాదని.. మార్పు కోసం ప్రయత్నిస్తేనే వస్తుందని ఆయన ఉద్ఘాటించారు. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఈ ప్రజా సేవా కార్యక్రమంలో పాలుపంచు కునేందుకు క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి, లేదా లింక్ మీద క్లిక్ చేసి ఇప్పుడే రిజిస్టర్ చేసుకోవాలని పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమాల్లో పవన్ కల్యాణ్ సూచించారు.

### ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు

# కృత్రిమ అవయవాలను బహుకరించిన తదేకం ఫౌండేషన్



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ఆదేశాల మేరకు తదేకం ఫౌండేషన్ వారు ఇద్దరు కు కృత్రిమ అవయవాలు 2,20,000 విలువచేసే పరికరాలు ఏర్పాటు చేశారు. ఈరోజు స్వగృహం వద్ద ప్రమాదవశాత్తు రెండు కాళ్లు పోగొట్టుకున్న కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట సారిపల్లి శివ జ్యోతి శ్రీదుర్గకు మరియు ప్రమాదంలో కరప మండలం నడకుదురు గ్రామంకు చెందిన ముమ్మిడి లక్ష్మణ మూర్తికి రోడ్డు ప్రమాదంలో ఒక కాలు పోగొట్టుకున్న సందర్భంలో తదేకం ఫౌండేషన్ వారు అందిస్తున్న కృత్రిమ అవయవలను ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తదేకం ఫౌండేషన్ ద్వారా ప్రమాదవశాత్తు అవయవాలు పోగొట్టుకున్న వారికి ఈ విధంగా సహాయ సహకారాలు అందిస్తున్న ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కృత్రిమ అవయవాల ద్వారా కొంతైనా వారు ఉపశమనం పొందాలని కోరుకుంటున్నాను అని తెలియజేశారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో కాలును పోగొట్టుకున్నానని ఏడు నెలల కాలంలోనే జనసేన నాయకులు సహకారంతో ఎమ్మెల్యే పంతం నానాజీ ద్వారా తదేకం ఫౌండేషన్ నాకు కృత్రిమ కాలనీ ఇవ్వడం జరిగిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. రైలు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్నారని నిరాశ్రయమునకు నాయకులు సహకారంతో తదేకం ఫౌండేషన్‌కు, ఎమ్మెల్యేకు మరియు కాకినాడ జిల్లా తదేకం ఫౌండేషన్ ప్రతినిధి శాండీ లకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు బిరుద భాస్కర్ తమ్మయ్య, గొల్లపల్లి శేఖర్, గిదుదురి శ్రీను, కాకరపల్లి ప్రతాప్, గొడవర్తి సందీప్, మెండు గోవింద్, సింగంపల్లి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు చీపురుపల్లి జయేంద్రబాబు, రాయుడు అనిల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడికి

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన



**కాకినాడ రూరల్/ కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మార్పీఎస్,ఎంఎస్‌పి వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకినాడ జిల్లా ఇంచార్జ్ సూరిపాక వాసుదేవరావు మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కాకినాడ జిల్లా కో ఇంచార్జ్ పసుపులేటి చిన్న బాబు మాదిగ సూచన మేరకు మహాజన సోషలిస్ట్ పార్టీ కాకినాడ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ మాదిగ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఈరోజు కాకినాడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలియజేసి ఆర్ఐకి వినతిపత్రం ఇవ్వటం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాజన సోషలిస్ట్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు వల్లూరి సత్తిబాబు మాదిగ హాజరై మాట్లాడుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి సిజె గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్ పై కేసు నమోదు చేసి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ అతను కాలు బూటుతో చేసిన దాడిని భారత రాజ్యాంగం పై మరియు భారతదేశంలో ఉన్న దళితులందరి ఆత్మగౌరవం పై చేసిన దాడిలా పరిగణలోకి తీసుకుని ఈ దాడి వెనుకను ఎంత పెద్ద శక్తులు ఉన్న సమగ్ర విచారణ జరిపి వారిని మరియు దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది పలివెల నవీన్ మాదిగ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన చలో అమరావతి కార్యక్రమాన్ని విజయంతో చేయాలని మాదిగ, మాదిగ ఉప కులాలు ఈ సందర్భంగా తెలిపిన ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకులు మిరియాల వీరబాబు మాదిగ, ఎంఎస్‌పి కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ తాతపూడి దివాకర్ మాదిగ, మోటుకూరి వరలక్ష్మీ మాదిగ, తుమ్మలపల్లి చిన్న మాదిగ, నరుకుర్తి రాజు మాదిగ, మిరియాల కుమార్ మాదిగ, పువ్వల భాస్కర మాదిగ కొముకూరి నాగేశ్వరరావు మాదిగ, రెల్లి కుల రాష్ట్ర నాయకులు గబ్బర్, నరుకుత్తి ఫకీర్ మాదిగ, దూలపల్లి కృష్ణ మాదిగ, పువ్వల కనకరాజు మాదిగ, మడికి భాను ప్రకాష్ మాదిగ, నేకూరి ఆనంద్ మాదిగ, మందపల్లి బుజ్జి మాదిగ, వీరబాబు మాదిగ, మాదిగ అశోక్ మాదిగ, మందపల్లి తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై చిన్నచూపుకు న్యాయమూర్తిపై దాడి నిదర్శనం

### దాడి వెనుక కుట్ర దారులపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం.. ఎమ్మార్పీఎస్ నాయకులు ధూళి జయరాజు, నేదునూరి రాజేష్




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న అత్యున్నత న్యాయ స్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడి దళితులపై జరుగుతున్న కుల వివక్షకు నిదర్శనమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 6న ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడివ్యక్తిని అరెస్టు చేయాలని, దీని వెనుక ఉండి అతనిని ప్రోత్సహించిన శక్తులను గుర్తించి శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మండపేట ఎమ్మార్పీఎస్ కార్యాలయం నుండి మండల ఎమ్మార్వో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. అనంతరం ఎమ్మార్వో తేజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ మాదిగ మాట్లాడుతూ ఈ దాడి వెనుక ఎంతటి శక్తులు ఉన్నా శిక్షించాలని లేనిపక్షంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధూళి జయరాజు మాదిగ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగింది అంటే అది దేశ రాజ్యాంగంపై జరిగిన దాడి దాడి జరిగినట్లే అని, ఘటన జరిగి ఇన్ని రోజులు గడిచినా, ప్రభుత్వాలు ఏ చర్యలు తీసుకోలేదంటే అది మా దళితులపై చిన్నచూపే అవుతుందని దీనిపై న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు గోసాల వినయ్, వి.హెచ్.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు షేక్ నబీ, బొమ్మ గంగాధర్, గాలింకి చరణ్, అయినవెల్లి రమణ, కొల్లి చిన్నారావు, చాపల సత్తెన్న, తాతపూడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విజయవంతంగా జిల్లాస్థాయి సైన్స్ సెమినార్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి మార్గదర్శకత్వంలో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విజయవంతంగా నిర్వహించబడింది. జిల్లాలోని వివిధ మండలాల నుండి 44 మంది విద్యార్థులు ఈ సెమినార్లో పాల్గొనగా మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు కూడా జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం పొందారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఏబీఎస్ నరసింహారావు ఉప్పలపాటి మాచిరాజు పివి బ్రహ్మానందం వరద శ్రీనివాసు ఎస్ బాబులు, సీతారామలక్ష్మి సిహెచ్ఎల్ జి.నరసింహారావు శెట్టిపల్లి మాధురి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో అయినవిల్లి మండలం జగన్నాధపురం విద్యార్థిని ప్రథమ స్థానం ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు విజేతలుగా రాష్ట్రస్థాయిలో జిల్లా తరపున పోటీ చేయనున్నారు రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ జై కన్వెన్షన్ హాల్లో లైవ్లో కాలేజీ నందు ఈ పోటీలు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన జిల్లా సైన్స్ అధికారి జివిఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ ఆవిష్కరణ దృక్పథం పెంపొందించడానికి ఇలాంటి సెమినార్లు ఎంతో అవసరం విద్యార్థుల ప్రతిభ రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిధ్వనిస్తుందని విశ్వసిస్తున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గొప్పల సూరి ప్రకాష్, పి.రామలక్ష్మి మూర్తి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బీరహనుమంతరావు సెక్టోరియల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంలో శ్రమకు తగిన ఫలితం

**మున్సిపల్ కార్పొరేషన్‌కి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డు - సీఎం రిలీఫ్ ఫండ్ కింద 235మందికి సహాయం**

**ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వెల్లడి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సజావుగా జరుగుతున్నా యని, ముఖ్యంగా రాజమండ్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో 19వ స్థానం, రాష్ట్రంలో రెండవ స్థానం లభించిందని గుర్తుచేసారు. స్థానిక హోటల్ జగదీశ్వరిలో శుక్రవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ జలశక్తి అవార్డు తో పాటు రూ 2కోట్లు బహుమతి మున్సిపల్ కార్పొరేషన్‌కి లభించిందని అన్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి కల్సి కట్టుగా చేస్తున్న అభివృద్ధి, పడుతున్న శ్రమకు తగిన ఫలితం కన్పిస్తోందని ఆయన అన్నారు. ముఖ్యంగా అభివృద్ధికి సంబంధించి గడిచిన ఏడాది కాలంగా నగరంలో 158కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేశామని, అలాగే 2025-26లో 120కోట్ల రూపాయల అంచనాతో పనులు చేపట్టాలని నిర్ణయించి, ఇందులో రూ 30కోట్ల పనులు నడుస్తున్నాయని ఎమ్మెల్యే వాసు వివరించారు. సిఎస్సార్ నిధుల పనులు పారదర్శకంగా చేస్తున్నామని, స్వయంగా తాను శ్రద్ధ తీసుకుని సిఎస్సార్ నిధులు అవకతవకలకు తావు లేకుండా, వ్యక్తిగత ఎజెండా లేకుండా ఖర్చు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వాసు చెప్పారు. 6.38కోట్ల రూపాయల సిఎస్సార్ నిధులు వెచ్చిస్తున్నామన్నారు. పేపరు మిల్లు కార్మికులకు యాజమాన్యంతో 15నెలల్లో అగ్రిమెంట్ చేయించి, కార్మికులకు న్యాయం చేసామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద 235మందికి రూ 2,66,54,188 ఇచ్చామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. వైసిపి హయాంలో ఒక్కరికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఎలాంటి జాప్యం లేకుండా 14ఎండోమెంట్ కమిటీలకు గాను 8పూర్తిచేశామని, త్వరలో మిగిలిన నాలుగు కమిటీలు వేస్తామని చెప్పారు. ప్రజలందరికీ ఎమ్మెల్యే వాసు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మీడియా సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, వర్రే శ్రీనివాస రావు, దొండపాటి సత్యంబాబు, ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రాధా, బుడ్డిగ రవి, కంటిపూడి శ్రీనివాస్, శెట్టి జగదీష్, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, తంగెళ్ళ బాబీ, కరగని వేణు, మహ్మద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

### రాజమండ్రిలో నకిలీ మద్యం, అక్రమ సిండికేట్ వసూళ్లపై


# ప్రభుత్వం దృష్టి పెట్టాలి

**అక్రమ మద్యం వ్యాపారాన్ని రెగ్యులరైజ్ చేస్తున్న వైనం నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు**

**ఎక్సైజ్ అధికారులు ప్రేమేయంపై కూడా విచారణ చేయాలి - జిల్లా ఎస్పీ కార్యాలయంలో పిర్యాదు చేసిన మాజీ ఎంపీ భరత్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రిలో నకిలీ మద్యం,అక్రమ సిండికేట్ వసూళ్లపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి, అక్రమ వ్యాపారంలో రాజమండ్రి టిడిపి నేతల తీరును వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ ఎండగట్టారు. చర్యలకు డిమాండ్ చేసారు. ఈమేరకు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయానికి చేరుకొని, కొద్దిసేపు భైఠాయించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్ బిఎం మురళీకృష్ణకు రాజమండ్రిలో అక్రమ లిక్కర్ వ్యాపారంలో టిడిపి నేతల తీరుపై ఫిర్యాదు చేస్తూ, చర్యల కోసం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్బంగా మాజీ ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రిలో టిడిపి నేతల కనెక్షన్లతో మద్యం అక్రమంగా జరుగుతోందని అయన ఆరోపించారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని రెగ్యులరైజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని భరత్ విమర్శించారు ఈ వ్యవహారంలో టిడిపి ఎమ్మెల్యేను భర్తరఫ్ చేయాలని సీఎం చంద్రబాబుకు్న డిమాండ్ చేసారు. మద్యం దుకాణదారులతో ఫోన్లో మాట్లాడిన నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఏ ఏ బ్రాండ్లకు ఎంతెంత వసూలు చేయాలో నిర్ణయించుకుంటున్నారు. ఆ బ్రాండ్లు ఏంటో బయట పెట్టాలన్నారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని లిమిటెడ్ కంపెనీగా మార్చేస్తున్నారని ఆయన విమర్శించారు. అక్రమాలకు బైలా రాసుకోవాలని అనుకోవడం దారుణమన్నారు. నకిలీ మద్యం తాగి జిఎస్ఎల్ ఆసుపత్రిలో ముగ్గురు యువకులు మృతి చెందారని, అందుకే రాజమండ్రిలో చలామణి అవుతున్న నకిలీ మద్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని భరత్ డిమాండ్ చేసారు. ఎక్సైజ్ అధికారులకు ఎన్ని కేసులు ఇవ్వాలో కూడా టిడిపి నేతల ఆధ్వర్యంలో సిండికేట్ నిర్ణయం చేస్తోందని ఆయన అన్నారు. అందుకే ఎక్సైజ్ అధికారులు ప్రేమేయంపై కూడా విచారణ చేయాలని భరత్ డిమాండ్ చేసారు.



# సీజే గావాయ్‌పై దాడి యత్నానికి ఎమ్మార్పీఎస్ నిరసన

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా...**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేట మండలం తాహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయటం జరిగింది దాడి యత్నానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దాడి వెనుక దాగివున్న పాత్రదారులు, సూత్రధారులపై కూడా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కు అందజేశారు. కార్యక్రమంలో కొత్తపేట మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు తోత్తరమూడీ రాము, కొత్తపేట మండల ఎంఆర్పిఎస్ ఇన్చార్జ్ కముజు శ్రీనివాసరావు, కొత్తపేట ఎమ్మెస్పి అధ్యక్షులు వంగలపూడి నరేంద్ర, కొత్తపేట ఎమ్మార్పీఎస్ ఉప అధ్యక్షులు నవంద్రి వెంకటేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సిద్దుల కృపానందం, ఉంద్రాజవరపు నాగేశ్వరరావు, కుందుర్తి నాగేశ్వరరావు, లంక రమేష్, సంఘ నాగరాజు పెదపూడి శీను, నుంద్రి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టు సీజేఐ బిఆర్ గవాయ్‌పై

# దాడిని ఎమ్మార్పీఎస్ ఖండిస్తున్నాం..

**దాడికి యత్నించిన వ్యక్తిపై కఠినమైన శిక్షలు నమోదు చెయ్యాలి..**

**ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆందోళన చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జ్ బయ్యారపు రాజేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వైరాల అప్పారావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరం తాసిల్దార్ కార్యాలయం వద్ద సుప్రీంకోర్టు జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఉభయ రాష్ట్రాలలోని ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు జడ్జి దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలని కోరారు. ఈ కేసును సుప్రీం కోర్టులో ప్రజాస్వామిక వాదులుగా గుర్తించబడ్డ సినియర్ జడ్జిలతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అక్టోబర్ 7,2025 రోజున భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాకేష్ కిషోర్ అనే వ్యక్తి షూస్‌తో దాడికి యత్నానికి పాల్పడ్డాడని వివరించారు. చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి అనాగరికమైందని అన్నారు. ఈ సంఘటన ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే ఉన్నదని తెలిపారు. ఈ దాడి సమస్త భారతీయులను దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత,పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేశ ప్రజలందరూ ఈ దాడిని ఖండించారని పేర్కొన్నారు. దళితుడైన బిఆర్ గవాయి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేక పోతున్నాయని విమర్శించారు. అందుకే అహంపూరితంగా ఈ దాడికి తెగపడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తి మీద తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దాడికి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా ఈ ఘటన మీద సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని కోరారు. సుప్రీం కోర్టులో అనుభవం కలిగిన ప్రజస్వామిక దృక్పథం కలిగిన రిటైర్డు జడ్జీలతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డిమాండ్లను తక్షణమే పరిగణలోని తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అనకాపల్లి డాన్ సూరి మాదిగ,ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు తోలేటి రాంప్రసాద్ మాదిగ, ఎంఎస్పీ నగర ఇంచార్జ్ వైరాల రమేష్, మాదిగ, రాచర్ల సుధా మాదిగ, పుల్లారావు మాదిగ, కూరాకులరాజు మాదిగ, కోడి శ్రీను మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### విశాఖకు గుగూల్ రాక

# ఉపాధి అవకాశాలకు శ్రీకారం..

**మంత్రి నారా లోకేష్ కృషి ఓ సంచలన చరిత్ర**

**చైర్మన్ కుడుపూడి సత్తిబాబు హర్షం..**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాగర నగరం విశాఖపట్నానికి గుగూల్ ఏఐ (కృత్రిమ మేధ) డేటా సెంటర్ రావడం ప్రపంచం లోనే ఓ గొప్ప విషయమని, దేశ భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానానికి, ఉపాధి అవకాశాలకు ఒక మైలు రాయి అని ఏపీ శెట్టి బలిజ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షా 33 వేల కోట్ల పెట్టుబడులతో గుగూల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకు రావడంలో మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయమన్నారు. నారా లోకేష్ కృషికి ఇది ఒక సంచలన చరిత్ర అని వ్యాఖ్యానించారు. నారా లోకేష్ 12 నెలల పాటు శ్రమించి, జాతీయ మార్గ దర్శకాలను సామరస్యంతో మార్పు చేయించి, ప్రపంచంలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా గుగూల్ డేటా సెంటర్ ను తీసుకు రావడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. హైదరాబాద్ కు మైక్రోసాఫ్ట్ రావడానికి నాడు చంద్రబాబు కృషి చేయగా, హైదరాబాద్ ప్రపంచ ప్రఖ్యాత నగరంగా పేరు పొందిందని గుర్తు చేశారు. అదే విధంగా లోకేష్ దార్శనిక దృష్టితో ఈ డేటా సెంటర్ రాకకు కృషి చేశారని వివరించారు. ప్రపంచంలోనే అమెరికా తర్వాత అతి పెద్ద ఏఐ హబ్ ను గుగూల్ క్లౌడ్ సంస్థ విశాఖలో ప్రారంభించడానికి ఒప్పందం చేసుకోవడం చరిత్రలో మైలురాయి అని ఆయన అభిప్రాయపడ్డారు.

### శ్రీపాండురంగస్వామి ఆలయం వద్ద

# మహా అన్న ప్రసాద వితరణ

**మూడు వేల మందికి అన్నసమర్పణ చేసిన కమిటీ సభ్యులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దసరా ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని రాజమహేంద్రవరం జాంపేటలో వేంచేసి ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవాలయంలో మహా అన్న ప్రసాద వితరణ జరిగింది. శ్రీ పాండురంగ స్వామి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు వికాసరావు, సీనియర్ బేసిక్ స్కూల్ డైరెక్టర్, ఆలయం కమిటీ అధ్యక్షులు పొట్నూరి సత్యనారాయణ ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, నగర టిడిపి అధ్యక్షులు మజ్జి రాంబాబు, కార్పొరేటర్ ద్వారా పార్వతీ సుందరి హాజరై భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పి.వికాసరావు, పొట్నూరి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీ పాండురంగ స్వామి దేవాలయం పురాతనమైందని తెలిపారు. గత మూడు సంవత్సరాలు కాలంగా ఆలయాన్ని అభివృద్ధి చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఆలయానికి అనేకమంది భక్తులు విరాళాలు ఇచ్చి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్, సాయి, బుచ్చిబాబు, చంద్రబాబు, పవన్, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

### దీపావళి అమ్మకపు షాపుల వద్ద

# నిబంధనలు పాటించాలి..

**బాణాసంచా అక్రమ నిల్వలు ఉంచరాదు - దీపావళి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి**

**అగ్నిమాపక శాఖ సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి పేరూరి శ్రీనివాస్**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అగ్నిమాపక శాఖ సూచించిన నిబంధనలను పాటించి ప్రజలు దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని తూర్పు గోదావరి జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అగ్నిమాపక అధికారి పేరూరు శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. శుక్రవారం కోటిపల్లి బస్టాండ్ వద్ద గల అగ్నిమాపక శాఖ కార్యాలయంలో విలేకరుల తో ఆయన మాట్లాడుతూ దీపావళి సామాన్లు విక్రయించే షాపులు వద్ద నాలుగు బకెట్లు రెండు డ్రమ్ములు ముందు జాగ్రత్త చర్యలుగా ఉంచాలని తెలిపారు. అలాగే బాల కార్మికులను 18 సంవత్సరాలు వయసు నిండని వారిని బాణాసంచా విక్రయించే షాపులు వద్ద ఉంచరాదని సూచించారు. జనసంచారం, ప్రజలు నివాసించే ప్రాంతాలలో బాణా సంచా నిల్వలు ఉంచరాదని పేర్కొన్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఆరు బయట బాణాసంచాలను కాల్చాలని వివరించారు. అనుమతి లేని ప్రాంతాలలో బాణాసంచా అమ్మకాలు నిల్వలు ఉంచరాదని సూచించారు. అక్రమ నిలవలు ఉంచిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణాసంచే అమ్మకాలు నిర్వహించే షాపులు వద్ద అత్యవసర ఫోన్ నెంబర్లు ఉంచుకోవాలని తెలిపారు. చిన్న పిల్లలకు పెద్దలు దగ్గర ఉండి వానసంచా కాల్చే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపక శాఖ సూచించిన నిబంధనలు పాటించి దీపావళిని ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

### కూటమి ప్రభుత్వంలో

# కాపులకు రక్షణ లేకుండా పోయింది...

**- కందుకూరులో సంఘటన హృదయ విధారకారం.. కాపు నేతలను కలిచి వేసింది..**

**- ముద్దాల అను, పోసి కుమార్**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ మధ్య కందుకూరులో జరిగిన ఘోరమైన సంఘటన.. పేద కాపు కుటుంబ మీద కారు తో పైశాచికంగా గుద్ది చంపిన అహంకారులను వెంటనే అరెస్టు చేయాలిని యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుపతి రావు (అను)డిమాండ్ చేశారు. ఈ సందర్బంగా అను ఒక ప్రకటనలో మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రెండో తారీకు విజయదశమి రోజు జరిగిన సంఘటన యావత్ ప్రజానీకాన్ని కాపు యువతను జాతిని భయాందోళనకు గురి చేస్తుందనిఇటువంటి నీచ నికృష్టమైన సంఘటనలు పునరావృతంగా రాకుండా ఉండేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని ఎవరైతే దోషులు ఉన్నారో వారిని వెంటనే అరెస్టు చేసి కుటుంబాలకు రక్షణ కల్పించాలని అన్నారు. యువకాపునాడు జాతీయ కన్వీనర్ ముత్యాల పోస్ట్ కుమార్ మాట్లాడుతూ ఈ సంఘటన చాలా కలిచి వేస్తుందని, కూటమి ప్రభుత్వంలో కాపులకు రక్షణ లేకుండా పోయిందని కాపు ఓటు బ్యాంకుతో గెలిచిన పార్టీ కాపులకు అన్యాయం చేస్తుందని రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని తెలియజేశారు. పెద్దన్న పాత్ర పోషిస్తానన్న కాపు నేతలు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కాపులకు న్యాయం చేసే దిశగా పెద్దన్న పాత్ర పోషించాలని పోసికుమార్ అన్నారు. రూరల్ మండల యువ కాపునాడు

### మద్యం వ్యాపారులతో

# నేను మీటింగ్ పెట్టినట్లు నిరూపించగలరా..?

**ఆ వాయిస్ నాది కాదు... అది ఫేక్ - ఈ విషయంపై పోలీసులకు పిర్యాదు చేశా**
**దర్యాప్తు చేస్తే నిజానిజాలు తెలుస్తాయి - సవాలు చేసిన నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం వ్యాపారులతో మాట్లాడినట్లుగా వైరల్ అవుతున్న వాయిస్ తనది కాదని, అది ఫేక్ అని నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు స్పష్టం చేసారు. ఈమధ్య ఏ ఐ తో నకిలీ వీడియోలు, వాయిస్ లు సృష్టిస్తున్నట్లు చూస్తున్నామని ఇది కూడా అలాంటిదేనని ఆయన అన్నారు. దీనిపై పోలీసులకు పిర్యాదు చేశానన్నారు. స్థానిక పాత సోమాలమ్మ పుంత రోడ్డులోని శ్రీకన్య ఇన్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్యాప్తు చేస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. మద్యం వ్యాపారులతో తాను మీటింగ్ పెట్టినట్లు నిరూపించాలని సవాల్ చేసారు. తనకు లిక్కర్ షాపులు లేవని,మద్యం వ్యాపారులతో మాట్లాడాల్సిన అవసరం లేదని, కేవలం తన ఎదుగుదలను చూసి ఓర్వలేక అడ్డుకోడానికే మాజీ ఎంపీ భరత్ ఫేక్ వీడియోలు, వాయిస్ లు చూపిస్తున్నారని, ఖబడ్దార్ భరత్ అని మజ్జి రాంబాబు అన్నారు. గతంలో కూడా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తిట్టినట్లు ఒక ఫేక్ ఆడియోను భరత్ సృష్టించారని, ఆయనకు ఇలాంటివి అలవాటేనని రాంబాబు అన్నారు. తనకు మద్యం షాపులు లేవని, ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తానని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి టీపసుకెళ్తున్నానని, ఎమ్మెల్యే వాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అలాగే టీడీపీలోని అందరి నాయకులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని ఆయన చెప్పారు. నగరంలో బలమైన్ సామాజిక వర్గంగా ఉన్న తూర్పు కాపు సంఘం కార్యదర్శిగా చాలా ఏళ్ళు పనిచేసి, ఇపుడు అధ్యక్షుడిగా ఉన్నానని, ఎక్కడా తప్పు చేయలేదని మజ్జి రాంబాబు అన్నారు. ఇయ్యపు కూర్మారావు, రౌతు సూర్యప్రకాశరావు వంటివాళ్ళు ఉల్లిపాయల వ్యాపారం చేసి ఎదిగారని, తాను కూడా అదే వ్యాపారం చేస్తున్నానని అన్నారు. ఈ వ్యాపారాన్ని కించపరిచేలా మాట్లాడ్డం భరత్ కి తగదన్నారు. బహుశా వైసిపి సిటీ ప్రెసిడెంట్ గా భరత్ ఉండడం, అందుకు సమానమైన టిడిపి నగర అధ్యక్షుడిగా తాను ఉండడంతో తట్టుకోలేక కుట్ర చేసినట్లు ఉందని ఆయన వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దాస్యం ప్రసాద్,ఈతలపాటి రవి, బొర్రా చిన్ని,సలాది ఆనంద్, బంగారు నాగేశ్వరరావు, యర్రంశెట్టి రాజ్ కుమార్, ఆడారి లక్ష్మీ నారాయణ, దుద్దేటి నాగేంద్ర, కడియాల వాసు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు

**కల్తీ మద్యం,గోవా మద్యం అమ్మడం లేదు - రాజమండ్రిలో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారని అనడం సమజసం కాదు**
**జాతీయ రహదారిపై నిబంధనల మేరకే షాపులు ఏర్పాటు చేశాం.. - ఆ ఆడియో సంభాషణలోని ఇద్దరితో మాకు సంబంధం లేదు**
**నగర వైన్ షాపుల ఓనర్స్ ప్రతినిధులు దేవరపల్లి కృష్ణ, కొత్తపల్లి బాలు**



**రాజమహేద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం విక్రయిస్తున్నామని, కల్తీ మద్యం, గోవా మద్యం అమ్మడం లేదని రాజమండ్రి వైన్ షాపుల ఓనర్స్ ప్రతినిధులు దేవరపల్లి కృష్ణ, కొత్తపల్లి బాలు(బాలసుబ్రహ్మణ్యం) స్పష్టం చేశారు. శ్రీకన్య ఇన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాజమండ్రిలో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారని అనడం సమజసం కాదని అన్నారు.రాజమండ్రి అర్బన్ రూరల్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 54 మంది వ్యాపారులు ఎవరి వ్యాపారం వారు చేసుకుంటున్నారని,సిండికేట్ అయ్యారని ప్రచారం చేయవద్దని కోరారు. అర్బన్ నియోజకవర్గంలో 39 షాపులు ఉన్నాయని వారు తెలిపారు.రెండు రోజులుగా మద్యం ధరలపై,ఇతర అంశాలపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో సంభాషణలోని ఇద్దరి వ్యక్తులతో తమకు ఎలాంటి సంబంధం లేదని దేవరపల్లి కృష్ణ, కొత్తపల్లి బాలు స్పష్టం చేశారు.ఎక్కడో జరిగిన కల్తీ మద్యం అంశంతో రాజమండ్రిలోని మద్యం వ్యాపారులకు ముడిపెట్టవద్దనివారు కోరారు. జాతీయ రహదారిపై ప్రభుత్వం, ఎక్సైజ్ డిపార్టుమెంటు నిబంధనలు, సూచనల మేరకు షాపులు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు జరుపుతున్నామని దేవరపల్లి కృష్ణ, కొత్తపల్లి బాలు చెప్పారు.ఎమ్మార్పి ధరలపై అదనంగా మద్యం విక్రయాలు జరపడం లేదని వారు చెప్పారు. ఈ వ్యాపారంలో అన్ని పార్టీలవారు,అన్ని కులాలవారు ఉన్నారని వారు, రాజకీయ ప్రయోజనాల కోసం తమను బదనాం చేయవద్దని కోరారు.ప్రభుత్వం 20 శాతం మార్జిన్ ఇస్తామని చెప్పడంతో ఎక్కువమంది రూ.40 లక్షలు రూ.50 లక్షలు కట్టి మద్యం లాటరీలో పాల్గొన్నారని ఇప్పుడు షాపులు వచ్చిన వారు వ్యాపారాలు సరిగా సాగక షాపులు మూసివేయాలని అనుకుంటున్నారని దేవరపల్లి కృష్ణ, కొత్తపల్లి బాలు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం వ్యాపారులు ఇలాగే బాధ పడుతున్నారని వారు అన్నారు. ప్రతి మద్యం దుకాణానికి పర్మిట్ రూము ఉందని వారు తెలిపారు. విలేకరుల సమావేశంలో వైన్ షాపుల ఓనర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదేశాలతో

## టిడ్కో గృహాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్





**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పురపాలక సంఘం పరిధిలోని బోడసకుర్రు టిడ్కో గృహ సముదాయాలు వద్ద అమలాపురం పురపాలక సంఘం కమీషనర్ వి.నిర్మల్ కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులచే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. టిడ్కో గృహ వద్ద కొన్ని రోజులుగా పేరుకు పోయిన చెత్తను తొలగింపు చేశారు. డ్రైన్ లలో పేరుకుని పోయిన చెత్తను ,ఇతర వ్యర్థాలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. ఈ పారిశుద్ధ్య డ్రైవ్‌ను స్వయంగా పరిశీలించిన కమీషనర్ వి.నిర్మల్ కుమార్, అక్కడ నివసిస్తున్న ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఈ కె.వి.సత్యనారాయణ, ఏఈ కె.వెంకటేష్, టిడ్కో స్పెషలిస్ట్ అధికారి డాక్టర్ డి.లలిత, ఇంచార్జి శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఆకుల కుమార స్వామి, శానిటేషన్ ఎన్విరాన్మెంట్ మరియు ఎమినిటిస్ సెక్రెటరీలు సెక్రెటరీలు పాల్గొన్నారు.

## జీఎస్టీ 2.0 ఉత్సవాల్లో విద్యార్థులకు చిత్రలేఖన ప్రదర్శన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ కృతివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ మరియు ఎకనామిక్స్ విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం జరిగింది.అందులో శుక్రవారం జిఎస్టీ 2.0 ఉత్సవాల్లో భాగంగా కళాశాలలో చిత్రలేఖన ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో విద్యార్థులు విరివిగా పాల్గొని వారి యొక్క చిత్రలేఖనాలను ప్రదర్శించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. రామకృష్ణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ బహుమతులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఆర్.వెంకటేశ్వర్లు, ఎకనామిక్స్ విభాగాధిపతి బి.రవి కుమారు మరియు కామర్స్ అధ్యాపకులు జి.సత్య దుర్గారావు, జే.రాజేషు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

### రాయవరంలో బాణాసంచా కేంద్రాలను

## తనిఖీ చేసిన ద్విసభ్య అధికార కమిటీ

**భద్రతా నియమాలను తప్పక పాటించాలి**
**పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం గ్రామ శివారు గణపతి ఫైర్ వర్క్స్ బాణాసంచా కర్మాగారంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద ఘటనతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం దీపావళి దగ్గర పడడంతో, రాష్ట్రంలో ఉన్న అన్ని బాణాసంచా తయారీ కర్మాగారాలలో, తనిఖీలు నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా మండల కేంద్రమైన రాయవరం చేరుకున్న ఉన్నత అధికారుల ద్విసభ్య బృందం సభ్యులు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఈగల్ ఐజీ ఆర్.కె.రవికృష్ణలు శుక్రవారం రాయవరంలోని ప్రమాద స్థలాన్ని సందర్శించి, అనంతరం మరొక బాణాసంచా తయారీ కేంద్రమైన భవాని గ్రాండ్ ఫైర్ వర్క్స్ కర్మాగారంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. భద్రతా నియమాలను తప్పక పాటించాలని సూచిస్తూ, లైసెన్స్ ఇన్సూరెన్స్ ఉంటే పలు పత్రాలను వారు పరిశీలించారు. పరివేక్షణ లో లోపం ఉండకూడదని అధికారులకు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారుల ద్విసభ్య బృందం వెంట జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా, ఆర్డీఓ డి.అఖిల, రామచంద్రపురం డిఎస్పి రఘువీర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ వి.పుల్లారావు, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, జిల్లా అగ్నిమాపక, విపత్తు నిర్వహణ అధికారి పార్థసారథి, తహసీల్దార్ ఎస్.బి. భాస్కర్, సహాయ కార్మిక కమిషనర్ టీ.నాగలక్ష్మి, రాయవరం ఎస్ఐ సురేష్ బాబు, జిల్లా పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## అధునాతన ఫిజియోథెరపీ మెగా వైద్య శిబిరం

**జాగ్రత్తలు తీసుకుంటే నొప్పులు మాయం : మోహిత్**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ర్యాలీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక అన్నపూర్ణ డే కేర్ హోమ్‌లో శ్యామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ అధినేత డాక్టర్ మోహిత్ సీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత అధునాతన ఫిజియోథెరపీ మెగా వైద్య శిబిరాన్ని రాష్ట్ర భారతీయ కిసాన్ సంగ్ కన్వీనర్ డాక్టర్ ఉప్పుగంటి భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్ట్ మోహిత్ మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు మరియు వ్యాయామం చేయడం ద్వారా భుజం నొప్పి మోకాళ్ళ నొప్పులు నడుము నొప్పి వంటి వాటి నుండి విముక్తి పొందవచ్చు అని వాటి నుండి ఎలా ఉపశమనం పొందాలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ర్యాలి పరిసర ప్రాంతాల నుంచి సుమారు 60 మంది ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నట్లు వారికి అధునాతన వైద్య చికిత్సను అందించడంతోపాటు అవసరమైన సుమారు పదిమందికి ఫిజియోథెరపీ మెటీరియల్ ఉచితంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి శ్యామ్ జాదుగరు మెగా మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పుగంటి భాస్కరరావు, వందనాదేవి, సీతారత్నం, తేజశ్రీ అన్నపూర్ణ, శ్రీధర్, కుమార లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గవాయ్‌పై దాడిని ఖండిస్తూ అల్లవరం తహసిల్దార్‌కి వినతి పత్రం అందించిన

## ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ అనుబంధ సంఘం నాయకులు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు యార్లగడ్డ రామకృష్ణ మాదిగ అధ్యక్షతన చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ మీద జరిగిన దాడిని ఖండిస్తూ అల్లవరం తాసిల్దార్ వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆకుమర్తి మోహన్ మాదిగ, జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చుట్టుగుళ్ళ నీలకంఠ మాదిగ, లూటుకుర్తి చిన్న మాదిగ, చాట్ల సత్యనారాయణ, నామాడి నాగరాజు, నౌంద్రు నాగరాజు, నామాడి నాగరాజు, బొమ్మ బాల కృష్ణ, నవ్వుంద్రు జానీ, బొమ్మి మహేష్, చిర్రా సతీష్, ఉంద్రాజవరపు రాజశేఖర్, కుందుర్తి రాజేంద్ర వర్మ, చెయ్యేటి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీను కలిసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్ర బృందం



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో అమలాపురంలో పర్యటిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్ర బృందం శుక్రవారం నాడు అమలాపురంలోని ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగిని కలిశారు. ఈ సందర్భంగా బృందం పరిశీలించిన అంశాలను ఎంపీకి వివరించారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఈ పథకం ప్రజా అవసరాల మేరకు కొన్ని సూచనలను ఎంపీ బృందానికి తెలిపారు. తద్వారా ఈ పథకం ప్రజా అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడుతుందని ఎంపీ హరీష్ బాలయోగి బృందానికి వివరించారు.

## మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**రూ.27 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనలకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు.శుక్రవారం రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ రాజు,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,డిఈ శ్రీకాంత్, కూటమి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక 4,28 వార్డుల్లో రూ.27 లక్షల రూపాయలతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు అధికారులతో కలిసి అయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక 4 వార్డులో అసంపూర్తిగా ఉన్న డ్రైన్ నిర్మాణం కోసం రూ.20 లక్షలు,28వ వార్డులోని శ్యామల సూపర్ మార్కెట్ దగ్గర రూ.7 లక్షలతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డుకు శంకుస్థాపన చేశామన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు, గ్రామాలు,పట్టణాల్లో అభివృద్ధి పనులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం నియోజవర్గం పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ నిధులు మంజూరుకు కృషి చేస్తూ అభివృద్ధి,సంక్షేమ సమపాళ్లలో చేపట్టారని ప్రస్తుతించారు.గడచిన 15 నెలల కాలంలో నియోజవర్గ పరిధిలో సుమారు రూ.140 కోట్లుతో అభివృద్ధికి చేయడం ఒక చరిత్రగా అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో 4,28 డివిజన్ కౌన్సిలర్లు,టిడిపి పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ,కూటమి పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, కడియాల రాఘవన్, కంచుమర్తి బాబురావు, కవల నానాజీ,దాసు తదితరులు పాల్గొన్నారు.

### ట్రంక్ పైప్ లైన్‌కి శంకుస్థాపన చేసిన

# ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగులంక గ్రామం వద్ద వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్‌లో భాగంగా ట్రంక్ పైప్‌లైన్ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గ శాసన సభ్యులు గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ 'మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఎక్కడా త్రాగునీటి సమస్యలు లేకుండా చూడాలనే సంకల్పంతో అఖండ గోదావరి జలాలను మన కోనసీమకు తీసుకురావడం ఒక చారిత్రాత్మక అడుగు' అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి శుభ్రమైన త్రాగునీరు చేరేలా పైప్‌లైన్‌లు, పెద్ద ట్యాంకులు ఏర్పాటు చేయబడుతున్నాయని తెలిపారు. ఈ అభివృద్ధి చర్య మన కూటమి ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు పట్ల ఉన్న చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీపీఆర్‌తో ప్రాణాలను రక్షించడానికి జీవ రక్షక ప్రక్రియ..



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** సీపీఆర్ అవగాహన వారోత్సవా లలో భాగంగా శుక్రవారం నిడదవోలు మండలంలోని సమిశ్రగూడెం వికాస్ కళా శాల యందు విద్యార్థినీ విద్యార్థులకు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్)నిడదవోలు మండలం,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు పోతుల సత్య వర ప్రసాద్ అధ్యక్షతన సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్కేఎస్ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ పి జగదీష్ విచ్చేసి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితి లలో ప్రాణాలను రక్షించడానికి ఉపయోగించే ఒక జీవ రక్షక ప్రక్రియ సీపీఆర్( కార్డియో పల్మనరీ రిససిటేషన్) అని,ఈ ప్రక్రియ ద్వారా ఎవరైన ఒక వ్యక్తి గుండెపోటు వల్ల గాని, విద్యుత్ షాక్ వల్ల గాని, నీటిలో మునిగిపోవడం వల్ల గాని శ్వాస లేదా గుండె పనిచేయడం ఆగిపోయినప్పుడు ఈ సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షించవచ్చని అన్నారు.ఈ సీపీఆర్‌లో వ్యక్తికి కృత్రిమ శ్వాసను అందించడం, ఛాతీపై కుదింపులు చేయడం జరుగుతుందని,దీని ద్వారా మెదడు మరియు ఇతర ముఖ్య అవయవాలకు రక్త ప్రసరణ కొనసాగి వ్యక్తికి ప్రాణాపాయం తప్పుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, మండల కార్యదర్శి పీవీవీ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఆత్కూరి రామారావు, నిడదవోలు బ్రాంచ్ రెడ్ క్రాస్ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, సీహెచ్ సత్యనారాయణ మూర్తి,ఎస్ సత్య నారాయణ, ఎం.సూర్యనారాయణ, ఎస్కే మస్తాన్, ఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా దివాకర్



**అమలాపురం రూరల్, విశ్వంవాయిస్ న్యూస్ :** అమలాపురం ఇంచార్జ్ తహసీల్దార్‌గా వివిఎస్ దివాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అమలాపురం తహసీల్దార్‌గా పనిచేసిన అశోక్ ప్రసాద్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. దాంతో అమలాపురం తాహసీల్దార్ పోస్ట్ ఖాళీ ఏర్పడడంతో ఉప్పల గుప్తం తహసీల్దార్ గా పని చేస్తున్న దివాకర్ కు ఎఫ్ఏసీ హోదాలో అదనపు తహసీల్దార్ బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర్ ముందు జరిగిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించి ఆరా తీస్తున్నారు.

### వాడపల్లి బస్టాండ్ నిర్మాణానికి

# అవసరమైన చర్యలు : కొత్తపేట ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం బస్టాండ్ అభివృద్ధి మరియు వాడపల్లి బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన చర్యలపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆర్టీసీ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాఘవ కుమార్, డిపో మేనేజర్ జి.వి.వి.ఎన్. కుమార్ రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వాడపల్లిలో భక్తుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మాణానికి సుమారు మూడు ఎకరాల స్థలం కేటాయించాలని అధికారులు ఎమ్మెల్యేను కోరారు.వాడపల్లి బస్టాండ్ నిర్మాణంతో పాటు భక్తుల రాకపోకలకు అదనపు బస్సులు కేటాయించాల్సిందిగా, అలాగే రావులపాలెం బస్టాండ్ ఆధునికీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో రావులపాలెం బస్టాండ్ ఎస్.ఏం. మైగపుల గురవయ్య పాల్గొన్నారు.

# సీసీ రోడ్లను పట్టించుకోండి మహాప్రభు..!

### శిథిల వ్యవస్థలో సిసి రోడ్లు - డ్రైనేజీ వ్యవస్థ లేక అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు





**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లు శిథిల వ్యవస్థకు చేరుకున్నాయి. పలు గ్రామాల్లో ఈ సీసీ రోడ్ల జీవితకాలం పూర్తికాకున్నా, నాణ్యత లోపం వల్ల శిథిల వ్యవస్థకు చేరుకుంటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పలు గ్రామాల్లో పంచాయతీలు చిన్న సమస్యగా ఉన్నదాన్ని పట్టించుకోకపోవడంతో అవి పూర్తిగా దెబ్బతిని వాహనదాలకు ప్రమాద భరితంగా మారుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో సరియైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, కాస్త కోస్తూ ఉన్న డ్రైనేజీ వ్యవస్థలో పూడికతీతలు తీయించకపోవడంతో దోమలకు, పందులకు నిలయాలుగా మారి ప్రజలు వివిధ అనారోగ్యాలకు గురవుతున్నారు. అదేవిధంగా సిసి రోడ్లు కూడా చాలా చోట్ల శిథిల వ్యవస్థకు చేరుకున్నాయి. పంచాయతీలో నిధులు కొరత, ప్రజాప్రతినిధులు అధికారుల నిర్లక్ష్యం వెలసి ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణిమారుతుంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి, సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# కమిషనర్ రాహుల్ మీనాని కలిసిన వై.శ్రీనివాస్ బృందం





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనా ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసిన రాజమహేంద్రవరం జనసేన పార్టీ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ భాషా ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ భాషా లిమ్రా, చైర్మన్ దాసరి గురునాథ రావు,మంచాల సునీల్, నగర ఉపాధ్యక్షులు సబ్బా రాజేష్ ఖన్నా, బ్యాంక్ డైరెక్టర్ కప్పల సూర్యప్రకాష్, నాళం భీమరాజు విగ్నేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్ చౌగొండి మురళి,శ్రీపందిరి మహాదేవుడు ట్రస్ట్ డైరెక్టర్ యందం ఇందిర, జనసేన పార్టీ కార్మిక నాయకులు కరిమెండి విజయ్ ,నగర ప్రధాన కార్యదర్శి పైడిరాజు, నగర కార్యదర్శి ముమ్మిడి భాగ్యలక్ష్మీ, నగర కార్యదర్శి వట్టికూటి వేణుగోపాల చౌదరి, 8వ వార్డ్ ఇంచార్జ్ అక్కిరెడ్డి ప్రసాద్,నగర నాయకులు భగవాన్, సంజయ్ సత్కరించిన వారిలో ఉన్నారు.

# కల్తీ కాలనాగు



కల్తీ మందులు కల్తీ రసాయన ఎరువులతో పంటలు పండిస్తూ కల్తీ కాలనాగును పెంచి పోషిస్తున్నాం..

శకుని ఆకలి కేకలు మరచి పోయమా అన్నమే దొరకని ఓ రోజు వస్తుందని మరచిపోయాం..

ప్రకృతి మాత పచ్చకోకను చించేసి అరణ్యాలు మింగేసి తెగిన గాలిపటంలా ఆనందాన్ని అనుభవిస్తున్నాం..

ప్లాస్టిక్‌ను పకృతి మాత కడుపులో పడేస్తూ పడగ విప్పిన కాలుష్య కాలనాగు క్రింద ఉన్నామని మరచి పోతున్నాం..

అన్నం పరబ్రహ్మ స్వరూపం అని మరచి ధన దర్పంతో విందులు వినోదాల పేరుతో మిగిలిన అన్నంను పడేస్తూ వీధి చివర చెత్త డబ్బాల దగ్గర ఎండిన డొక్కలతో ఆకలితో అలమటిస్తున్న అనాథలను మరచి పోతున్నాం..

పకృతి మన ఇంటి రేపటి దీపాలను ఆర్పే యక ముందే ప్లాస్టిక్ వాడకాన్నికల్తీ రసాయన ఎరువులను పూర్తిగా మానేయడం మరియు చెట్లను నాటడం చెయ్యాలని కోరుకుంటూ..

రచన:
**మంజుల పత్తిపాటి,**
**మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,**
**యాదాద్రి భువనగిరి జిల్లా,**
**తెలంగాణ రాష్ట్రం,**
**చరవాణి: 9347042218.**

### ఆత్మ కమిటీ నెంబర్లుగా ఎన్నికైన బీజేపీ నాయకులు

# పాలాటి మాధవ స్వామి, మద్దెంశెట్టి శ్రీనివాసరావులకు సత్కారం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్మ కమిటీ నెంబర్లుగా ఎన్నికైన బీజేపీ నాయకులుకి పాలాటి మాధవ స్వామి, (కొత్తపేట మండలం) మద్దెంశెట్టి శ్రీనివాసరావు (రావులపాలెం మండలం)లను రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం నివాసం లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేసారు. రైతులు ఎదురుకొంటున్న సమస్యలు పై దృష్టి సరించాలి అని సత్యనందం సూచించారు. ఈ పదవి రావడం పట్ల ఎమ్మెల్యే బండారు సత్యనందం కి మాధవ, శ్రీనివాస్ రావు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల బీజేపీ అధ్యక్షులు సంపతి కనకేశ్వరావు, రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్, గొల కోటి వెంకటేశ్వరరావు, అన్యం సత్య నారాయణ, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, బమిడిపాటి లక్ష్మీనారాయణ, కోటిపల్లి రఘు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

### సుప్రీమ్ కోర్ట్ జడ్జిపై దాడికి నిరసనగా

# ఎమ్మార్పీఎస్ ఆందోళన

### తహశిల్దార్‌కి వినతిపత్రం అందజేత




**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జ్ డాక్టర్ కె సామ్రాట్ మధుల పిలుపు మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయిపై జరిగిన పాసవిక దాడిని ఖండిస్తూ శుక్రవారం కాజులూరు మండల తహసీల్దార్ కార్యాలయం దగ్గర నిరసన ర్యాలీ చేపట్టి ఎమ్మార్వో గారికి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పలివెల ఇజ్రాయిల్ రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరారు. కాజులూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఖండవెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని రాజ్యాంగంపై జరిగిన దాడిగాను, దళితులపై జరిగిన దాడిగాను పరిగణిస్తున్నామని దాడి చేసిన వారిని వెంటనే చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రామచంద్రపురం ఎంఆర్పిఎస్ ఇన్చార్జ్ సిరా సురేష్ మాట్లాడుతూ ఈ దాడి చేసిన వారిని వెంటనే శిక్షించకపోతే దేశవ్యాప్తంగా దళితులందరూ ఒక్కటై నిరసన కార్యక్రమాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పలివెల రాజు, పలివెల ఇజ్రాయిల్ రాజు, కొమ్ము కృష్ణమూర్తి, ఇందుర్తి బుజ్జి, జొన్నకూటి వెంకటరమణ, లాజరు, రాయి రవి, పలివెల రవి, తాతపూడి ఇజ్రాయిల్, పలివెల సత్యనారాయణ, యాకోబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గ్రామ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# చియా సీడ్స్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్

ఈ మధ్య కాలంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. కొలెస్ట్రాల్, బరువు తగ్గించుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగానే డైట్ లో మార్పులు చేర్పులు చేసుకుంటున్నారు. ముఖ్యంగా రకరకాల సీడ్స్ కి ప్రాధాన్యం ఇస్తున్నారు. అందులో తప్పనిసరిగా కనిపించేవి చియా సీడ్స్. ఇందులో ఎన్నో పోషకాలున్నాయి. ముఖ్యంగా బరువు తగ్గడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. నీటిలో నానబెట్టి తీసుకుంటే మలబద్ధకం సమస్య కూడా తీరిపోతుంది. ఇన్ని ఉపయోగాలు ఉన్నప్పటికీ సరైన విధంగా వీటిని వాడడం తెలియకపోతే సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు అని హెల్త్ ఎక్స్ పర్ట్స్ వారిస్తున్నారు. మోతాదు మించి వాడడం వల్ల లాభాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు. చియా సీడ్స్ అనగానే అందరూ చెప్పేమాట ఇదో సూపర్ ఫుడ్ అని. అలా అనడానికి కారణాలున్నాయి. ఎందుకంటే చియా సీడ్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో పాటు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇన్ని పోషకాలున్నాయి కదా అని ఎక్కువ మోతాదులో తీసుకుంటే మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు. ముఖ్యంగా ఎలా తీసుకోవాలో ఓ అవగాహన లేకుండా తింటే చాలా సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే వీటిని తినే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. చియా సీడ్స్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ లో ముందుగా మాట్లాడుకోవాల్సింది జీర్ణ సమస్యల గురించే. మామూలుగా అయితే ఇందులో ఫైబర్ ఉంటుంది. ఆహారం త్వరగా జీర్ణం కావడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ఎక్కువగా తీసుకుంటే మాత్రం ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా సరిగ్గా నీరు తీసుకోకుండా కేవలం చియా సీడ్స్ ని అధికంగా తినడం వల్ల పొట్ట ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం లాంటి సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. పొట్టలో నొప్పి వచ్చి ఇబ్బంది పడాల్సి వస్తుంది. సాధారణంగా చియా సీడ్స్ ని నీటిలో నానబెట్టి మాత్రమే తినాలని సూచిస్తుంటారు వైద్యులు. అందుకు ఓ కారణం ఉంది. నీటిలో ఈ సీడ్స్ వేసినప్పుడు మెల్లగా అదో జెల్ మాదిరిగా తయారవుతుంది. అప్పుడు తిన్నా ఎలాంటి ఇబ్బంది లేకుండా సులువుగా జీర్ణం అవుతుంది. కానీ..కొంత మంది తెలియకుండా నీటిలో నానబెట్టకుండా నేరుగా వీటిని తింటూ ఉంటారు. ఇలా తిన్నప్పుడు అవి సరిగ్గా జీర్ణం కావు. పదేపదే గొంతులోకి వచ్చినట్టుగా అవుతాయి. అంతే కాదు. ఇలా పొడిగా తినడం వల్ల నాలుక కోసుకుపోయినట్టుగా కూడా అవుతుంది. అందుకే తప్పనిసరిగా వీటిని నీటిలో నానబెట్టాల్సి ఉంటుంది. ఇక చియా సీడ్స్ ని చాలా మంది పాల ఉత్పత్తులతో కలిపి తింటూ ఉంటారు. మామూలుగానే నీటిలో వేసినప్పుడు ఈ గింజలు ఉబ్బుతాయి. జెల్ గా మారతాయి. అయితే..పాలు, లేదా పాల ఉత్పత్తులతో కలిపినప్పుడు ఇవి మరింత మందంగా తయారవుతాయి. ఫలితంగా వీటిని తినడానికి చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. అంతే కాదు. ఇవి మందంగా తయారవడం వల్ల తొందరగా జీర్ణం కూడా కావు. ఫలితంగా పొట్ట అంతా పట్టేసినట్టుగా తయారవుతుంది. ఇందాకే చెప్పుకున్నట్టుగా చియా సీడ్స్ లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి గుండెకి చాలా మంచి చేస్తాయి. ఎందుకంటే..బ్లడ్ ప్రెజర్ ని తగ్గించడంలో ఇవి ఎంతో తోడ్పడతాయి. చియా సీడ్స్ అందరికీ మంచివే అయినా లోబీపీతో ఇబ్బందులు పడుతున్న వారిలో మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ కి దారి తీస్తుండవచ్చు. ఎందుకంటే చియా సీడ్స్ కారణంగా బ్లడ్ ప్రెజర్ తగ్గుతుంది. ఇప్పటికే లోబీపీ సమస్యకు మందులు వాడుతున్న వారు చియా సీడ్స్ తింటే బీపీ మరింత పడిపోతుంది. ఇది చాలా ప్రమాదకరం. అందుకే లోబీపీ ఉన్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ చియా సీడ్స్ ని తినకూడదు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే..చియా సీడ్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అయితే చాలా మంది వెజిటబుల్ సలాడ్ తో పాటు చియా సీడ్స్ తీసుకుంటారు. అయితే ఫైబర్ ఎక్కువగా ఉండే కూరగాయలతో పాటు చియా సీడ్స్ తీసుకుంటే ఫైబర్ కంటెంట్ ఎక్కువైపోతుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. చియా సీడ్స్ లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కేవలం బ్లడ్ ప్రెజర్ ని తగ్గించడమే కాదు. రక్తాన్ని కూడా పల్చగా మార్చేస్తుంది. ఇప్పటికే ఈ సమస్య ఉండి మెడిసిన్ వేసుకుంటున్న వారు చియా సీడ్స్ అతిగా తింటే రక్తం మరీ పల్చగా మారిపోయే ప్రమాదం ఉంటుంది.

# ఐరన్ తక్కువైతే ఇలా ప్రభావం చూపుతుంది!




రక్తహీనత (అనీమియా) అనేది చాలా మంది చిన్న సమస్యగా భావించినప్పటికీ, వైద్య నిపుణుల ప్రకారం ఇది శరీరానికి ముప్పు తెచ్చే 'నిశ్శబ్ద వ్యాధి'. మన శరీరంలోని ప్రతి అవయవానికి ఆక్సిజన్ సరఫరా రక్తం ద్వారా జరుగుతుంది. అయితే రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయి తగ్గిపోతే దానిని రక్తహీనత అంటారు. హీమోగ్లోబిన్ తక్కువగా ఉంటే శరీర అవయవాలకు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వల్ల పలు రకాల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి.వైద్యులు చెబుతున్నట్లుగా, చాలామంది రక్తహీనతను పెద్ద సమస్యగా భావించరు, కానీ వాస్తవానికి ఇది చాలా తీవ్రమైన పరిస్థితి. తాజా గణాంకాల ప్రకారం భారతదేశంలో పురుషుల్లో సుమారు 25 శాతం, మహిళల్లో 57 శాతం, పిల్లల్లో 67 శాతం, గర్భిణీల్లో 52 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.రక్తహీనత ఉన్నవారిలో శరీర శక్తి తగ్గిపోవడం, అలసట, నిరుత్సాహం, గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కాళ్ల వాపు వంటి లక్షణాలు తరచూ కనిపిస్తాయి. రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో చిన్న వ్యాధులే తీవ్రమైన సమస్యలుగా మారే అవకాశం ఉంటుంది. రక్తహీనత అధికమైతే గుండెపై అదనపు ఒత్తిడి పడి, గుండె వాపు లేదా ఇతర హృదయ సంబంధిత సమస్యలు రావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.చాలామంది తినే ఆహారం సరిపోకపోవడం వల్ల రక్తం తగ్గిపోతుందని భావిస్తారు. కానీ నిపుణుల అభిప్రాయం ప్రకారం, రక్తహీనత ఉన్నవారిలో ఆకలి తగ్గడం వల్లే ఆహారం తినే పరిమాణం తగ్గుతుందంటున్నారు. ముఖ్యంగా మహిళల్లో నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, హార్మోన్ల అసమతుల్యత (ఉదాహరణకు థైరాయిడ్), గర్భసంచి గడ్డలు వంటి పరిస్థితులు రక్తహీనతకు దారితీస్తాయి.గర్భిణీ స్త్రీల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. రక్తహీనతతో బాధపడే తల్లులకు పుట్టే శిశువులు తక్కువ బరువుతో పుడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే ప్రసవానంతరం తల్లులు తీవ్ర నీరసం, బలహీనతతో బాధపడే ప్రమాదం ఉంది.ఇక ఇతర వైద్య కారణాల్లో కడుపులో అల్సర్, క్యాన్సర్ వంటి వ్యాధులు కూడా రక్తహీనతకు కారణమవుతాయి. శరీరంలో ఇనుము, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి పోషకాల లోపం కూడా ఈ సమస్యను పెంచుతుందని నిపుణులు సూచిస్తున్నారు.రక్తహీనతను ఎప్పుడూ చిన్నచూపు చూడకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏవైనా లక్షణాలు గమనించిన వెంటనే వైద్యుని సంప్రదించి సరైన రక్తపరీక్షలు చేయించుకోవాలి. ఆహారంలో ఇనుము సమృద్ధిగా ఉండే పదార్థాలు ు పాలకూర, బీట్‌రూట్, జాగ్రి (బెల్లం), ఆకుకూరలు, పొడి పండ్లు ు చేర్చుకోవడం ద్వారా రక్తహీనతను నియంత్రించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# జీవనశైలితో మెరుగైన ఆరోగ్యం!



శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో జీవక్రియ (మెటబాలిజం) కీలక పాత్ర పోషిస్తుంది. ఆధునిక జీవనశైలిలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు ఇది. జీవక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి వైద్య నిపుణులు కొన్ని ముఖ్యమైన సూచనలు చేస్తున్నారు. ఈ పద్ధతులు మీ శరీరాన్ని తీవ్ర ఒత్తిడికి గురిచేయకుండా, సురక్షితమైన రీతిలో మీ జీవనశైలిని మార్చుకోవడానికి దోహదపడతాయి. ముఖ్యంగా, మితిమీరిన ఆహార నియంత్రణ పద్ధతులకు దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్యకరమైన జీవక్రియకు సరైన పోషకాహారం కీలకం. నాణ్యమైన ప్రోటీన్‌ను తగినంతగా ఆహారంలో చేర్చుకోవడం చాలా ముఖ్యం. ఇది కండరాల నిర్మాణానికి సహాయపడటంతో పాటు, జీవక్రియ రేటును స్థిరంగా ఉంచుతుంది. ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వుల సమతుల్యత ఉండే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమం. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు సమృద్ధిగా ఉండే ఆహార ప్రణాళిక మీ శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను అందిస్తుంది. శారీరక శ్రమ జీవక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. వైద్యుల సూచనల ప్రకారం, రెగ్యులర్ వ్యాయామం, ముఖ్యంగా స్ట్రెంగ్త్ ట్రైనింగ్ (బరువులు ఎత్తడం లేదా రెసిస్టెన్స్ బ్యాండ్‌లు ఉపయోగించడం) కండరాల నిర్మాణానికి సహాయపడుతుంది. కండర ద్రవ్యరాశి పెరగడం వల్ల విశ్రాంతి సమయంలో కూడా ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయి, ఫలితంగా జీవక్రియ మెరుగుపడుతుంది. రోజువారీ నడక లేదా తేలికపాటి వ్యాయామాలను మీ దినచర్యలో భాగం చేసుకోవడం కూడా ప్రయోజనకరం. ఇక, తగినంత నిద్ర, ఒత్తిడి నిర్వహణ జీవక్రియకు అత్యంత అవసరం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రతి రాత్రి 7 నుంచి 8 గంటలు నిద్రపోవడం ముఖ్యం. నిద్ర లేమి హార్మోన్ల అసమతుల్యతకు దారితీసి, జీవక్రియను మందగింపజేస్తుంది. సరైన నిద్ర జీవక్రియ ప్రక్రియలను సరిచేస్తుంది. ఒత్తిడిని తగ్గించడానికి ధ్యానం, యోగా వంటి పద్ధతులను అనుసరించడం వల్ల శారీరక ఆరోగ్యంపై సానుకూల ప్రభావం ఉంటుంది. ఈ సాధారణ మార్పులు మెరుగైన జీవక్రియ ఆరోగ్యానికి, తద్వారా మంచి జీవితానికి దారితీస్తాయి.

# పొట్ట ఉబ్బరాన్ని తగ్గించే ఫుడ్స్



గ్యాస్, మలబద్ధకం. ఈ రెండు సమస్యలు చాలా మందిని ఇబ్బంది పెడుతున్నాయి. నిద్రలేచిన దగ్గర నుంచి మళ్లీ పడుకునేంత వరకూ పొట్టలో అసౌకర్యంగా అనిపిస్తూనే ఉంటుంది. ఏం తిన్నా సరే సరిగ్గా జీర్ణం కాదు. విపరీతంగా పొట్ట ఉబ్బిపోయినట్టుగా అవుతుంది. ఈ సమస్య నుంచి బయటపడడానికి చాలా మంది మందులు వాడుతుంటారు. ఇవి వాడక తప్పదు. అలా అని పూర్తిగా వాటిపైనే ఆధారపడితే ఎప్పుడో అప్పుడు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. అందుకే సహజంగానే ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవాలి. ఇందుకోసం ముందుగా చేయాల్సిన పని ఏంటంటే..ఆహారంలో మార్పులు చేసుకోవడం. ఇందులో భాగంగానే కొన్ని పొట్ట ఉబ్బరం తగ్గడానికి కొన్ని రకాల ఫుడ్స్ తీసుకోవాలని చెబుతున్నారు డాక్టర్ సౌరభ్ సేథి. ఈ ఫుడ్స్ తీసుకోవడం వల్ల చాలా త్వరగా ఈ సమస్య నుంచి రిలీఫ్ వస్తుందని వివరించారు. కివీ: పొట్ట ఉబ్బరాన్ని తగ్గించడంలో చాలా బాగా పని చేసే ఫుడ్స్ లో ముందుగా చెప్పుకోవాల్సింది కివీ గురించి. కివి పండ్లను ఒకప్పుడు చాలా తక్కువగా తినే వారు. కానీ రానురాను చాలా మందికి ఆరోగ్యంపైన అవగాహన పెరుగుతోంది. కివీ పండ్లలో ఉండే పోషకాల విలువల గురించి తెలిశాక ఎక్కువ మంది ఇప్పుడు వీటిని తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కివీ పండ్లు రోగనిరోధక శక్తిని పెంచడంలో చాలా తోడ్పుతుంది. అంతే కాదు. గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ సహకరిస్తుంది. కివిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. రెగ్యులర్ గా తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఇక పొట్ట ఉబ్బరాన్ని తగ్గించడంలోనూ ఇది సహకరిస్తుంది. అందుకు ఓ ముఖ్యమైన కారణం ఉంది. అదేంటంటే..ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుది. ఇది జీర్ణ ప్రక్రియను మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. ఇదే సమయంలో మలబద్ధకాన్ని కూడా పోగొడుతుంది. అందుకే రోజువారి డైట్ లో తప్పనిసరిగా కివీ పండ్లు ఉండేలా చూసుకోవడం మంచిది.

**బొప్పాయి:** కివీ తరవాత ఆ స్థాయిలో పోషకాలు అందిస్తుంది బొప్పాయి. బొప్పాయిలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. కంటి ఆరోగ్యానికి ఇది చాలా మంచిది. పైగా ఇందులో వాటర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. ఫలితంగా కాస్త తినగానే కడుపు నిండిపోయినట్టుగా అవుతుంది. ఈ కారణంగానే అనారోగ్యకరమైన ఆకలి తగ్గిపోతుంది. బరువు తగ్గాలనుకునే వారు రెగ్యులర్ గా బొప్పాయి తింటే చాలా మంచిది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. అందుకే క్యాన్సర్ కణాలు వృద్ధి చెందకుండా ఇవి అడ్డుకుంటాయి. బొప్పాయిలో ఉండే ఎంజైమ్స్ జీర్ణ క్రియను మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా పొట్టలో ఉబ్బరం, మలబద్ధకాన్ని తగ్గించడంలో తోడ్పడతాయి. ఇందుకు ముఖ్య కారణం ఏంటంటే..కివీలాగానే బొప్పాయిలోనూ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫలితంగా జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. పైనాపిల్: పైనాపిల్ కూడా ఆరోగ్యాన్ని అందించడంలో ముందుంటుంది. ఇందులోనూ విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఇదే సమయంలో పైనాపిల్ లో మాంగనీస్ లాంటి మినరల్స్ ఉంటాయి. అన్నింటి కన్నా ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ ఎక్కువగా ఉంటే చాలా త్వరగా జీర్ణం అవుతుంది. అంతే కాదు. బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణ క్రియకు సహాయపడుతుంది. కండరాలు బలంగా మారడానికి పైనాపిల్ ఎంతగానో ఉపయోగపడుతుంది. పైనాపిల్ తో పాటు కీరదోసకాయలు కూడా చాలా బాగా ఉపయోగపడతాయి. పొట్టలో ఉబ్బరం తగ్గడానికి ఇవి కూడా తోడ్పడతాయి. ముఖ్యంగా ఇందులో ఫైబర్ తో పాటు వాటర్ కంటెంట్ అధికంగా ఉంటుంది. ఫలితంగా జీర్ణ వ్యవస్థ మెరుగవుతుంది.

**చియా సీడ్స్:** చియా సీడ్స్ ఉపయోగాలు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ రోజుల్లో చాలా మంది వీటిని విరివిగా వాడుతున్నారు. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. నీటిలో నానబెట్టడం వల్ల ఇవి జెల్ గా మారతాయి. వీటిని తీసుకోవడం వల్ల జీర్ణ శక్తి మెరుగవుతుంది. ముఖ్యంగా పేగులలో కదలికలు వచ్చి మలవిసర్జన సాఫీగా జరుగుతుంది. చియా సీడ్స్ ఇంతగా ఉపయోగపడడానికి కారణం ఏంటంటే..ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది డైజెస్టివ్ ఎంజైమ్స్ ని విడుదల చేయడంలో తోడ్పడుతుంది. అయితే చియా సీడ్స్ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వీటిలో ఫైబర్ ఉంది కదా అని ఎక్కువ మొత్తంలో తీసుకుంటే పొట్ట ఉబ్బరం తగ్గకపోగా పెరుగుతుంది. గ్యాస్ కూడా వస్తుంది. అందుకే మోతాదుకు మించి వీటిని వినియోగించకూడదు.

## బిజినెస్ వాయిస్

### రూ. 200 కోట్లతో అమరావతిలో 4 స్టార్ దసపల్లా హెూటల్




అమరావతిలో అభివృద్ధి దూసుకుపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజధానిలో పెట్టుబడులు పెట్టాలని వివిధ కంపెనీలను ఆహ్వానించారు. ఈ మేరకు పలు సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయి. తాజాగా రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు హెూటల్ దసపల్లా గ్రూపు ముందుకు వచ్చింది. రూ. 200 కోట్లతో 4 స్టార్ హెూటల్ నిర్మించాలని దసపల్లా అమరావతి హెూటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వంతో చర్చలు జరిపింది. ఇందుకు సానుకూలంగా స్పందన రావడంతో హెూటల్ నిర్మాణం చేపట్టేందుకు రెడీ అయింది. ఈ దసపల్లా హెూటల్ నిర్మాణంతో 400 మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్ర పన్నులు ,స్టాంప్ డ్యూటీ 100 శాతం తిరిగి చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. పరిశ్రమల తరహాలో విద్యుత్ చార్జీలు విధింపు ,5 ఏళ్లకు విద్యుత్ సుంకం తిరిగి చెల్లించాలని నిర్ణయం తీసుకోవడంతో పాటు టూరిజం పాలసీ 2024-29 ప్రకారం పలు రాయితీలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

### హైదరాబాద్‌లో రూ.1.35 లక్షలు దాటిన పసిడి ధర




దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.35 లక్షలు దాటి పరుగులు పెడుతోంది. శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,35,250కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల ధర రూ.1,21,725కి చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,81,000కి చేరింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. మరోవైపు, ధనత్రయోదశి నాడు ప్రజలు బంగారం, వెండి, విలువైన ఇతర పాత్రలను కొనుగోలు చేస్తారు. ఇది సంపద, అదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. ఆ సెంటిమెంట్ కూడా బంగారం ధర పెరుగుదలకు కారణమవుతోంది. దాంతోపాటు పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# 'ఓఆర్ఎస్' పదాన్ని తొలగించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు




భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆహార భద్రత కమిషనర్లు, కేంద్ర లైసెన్సింగ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులు (ఎఫ్‌బీఓలు) తమ ఆహార ఉత్పత్తులపై 'ఓఆర్ఎస్' అనే పదాన్ని తొలగించాలని స్పష్టం చేసింది. ఈ పదాన్ని ఏ రకంగానూ ఉపయోగించవద్దని, ఉత్పత్తి పేరులో ట్రేడ్‌మార్క్‌గానూ వాడకూడదని ఆదేశాల్లో పేర్కొంది. అలా 'ఓఆర్ఎస్ ' పదాన్ని వాడటం ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని వెల్లడించింది. సంబంధిత అధికారులందరూ ఈ చట్టం సూచించిన లేబులింగ్, ప్రకటనల అవసరాలకు, దాని కింద రూపొందించిన నిబంధనలకు కట్టుబడి ఉండేలా చూసుకోవాలని కోరింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎఫ్ఎస్ఎస్ఏఐ.. ఆహార ఉత్పత్తులైన పండ్ల రసాలు, నాన్-కార్బొనేటెడ్, రెడీ-టూ-డ్రింక్ బేవరేజెస్‌లకు అనుబంధనంగా గానీ, జతగా గానీ లేబుళ్లపై ఉపయోగించేందుకు అనుమతిచ్చింది. అయితే, 'డబ్ల్యూహెచ్ఓ సిఫార్సు చేసిన ఓఆర్ఎస్ ఫార్ములా కాదు ' అనే హెచ్చరిక ఉండాలని సూచించింది. అయితే, ఎఫ్ఎస్ఎస్ఏఐ మరింత సమగ్రంగా సమీక్షించిన తర్వాత, పండ్ల రసాలు, నాన్-కార్బొనేటెడ్, రెడీ-టూ-డ్రింక్ బేవరేజెస్ వంటి ఆహార ఉత్పత్తుల కోసం ట్రేడ్‌మార్క్ చేసిన పేరులో లేదా మరేదైనా 'ఓఆర్ఎస్' అనే పదాన్ని ఏ విధంగానైనా ఉపయోగిస్తే ఆహార భద్రత, ప్రమాణాల చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించడమేనని తాజాగా తెలిపింది. ఇలాంటి పద్ధతులు తప్పుడు, మోసపూరిత, అస్పష్టమైనవని, నకిలీ పేర్లు లేదా లేబుల్ ప్రకటనలను ఉపయోగించి వినియోగదారులను తప్పుదారి పట్టిస్తున్నట్టు గుర్తించామని ఎఫ్ఎస్ఎస్ఏఐ వివరించింది. అన్ని ఆహార వ్యాపార నిర్వాహకులు తక్షణమే నిబంధనలను పాటించేలా చూసుకోవాలని, ఉల్లంఘనలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కూడా ఆదేశించింది.

# తమిళనాడుకు తరలిన ఫాక్స్‌కాన్!




ఒకప్పుడు భారత్‌లో పెట్టుబడి పెట్టేందుకు ఏ విదేశీ సంస్థ ముందుకొచ్చినా తొలుత తెలంగాణను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే.. ఇతర రాష్ట్రాలతో చర్చలు జరపడం ఆనవాయితీ అంటే అతిశయోక్తి కాదు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పరిస్థితి మారింది. నాడు పోటీపడి జాతీయ, అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించిన రాష్ట్రం.. నేడు కనీసం ఉన్న కంపెనీల విస్తరణను కూడా నిలుపుకోలేని స్థితికి వెళ్లిపోతున్నది. ఇందుకు ఫాక్స్‌కాన్ సంస్థే తాజా ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి తరలివచ్చిన ఈ తైవాన్ కంపెనీ.. ఇప్పుడు విస్తరణ కోసం తమిళనాడును ఎంచుకున్నది. రూ.15 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. అయితే తెలంగాణలోనే అదనపు పెట్టుబడులు పెట్టేలా కంపెనీని ఒప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడం వల్లే ఇలా జరిగిందని పరిశ్రమ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడుల గమ్యస్థానంగా మారగా.. ఇప్పుడు ప్రముఖ కంపెనీలు ఇతర రాష్ట్రాలవైపు మళ్లుతున్నాయని చర్చ జరుగుతున్నది. ఇప్పటికే కేన్స్ టెక్నాలజీస్ వంటి పలు దిగ్గజ కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయిన సంగతి తెలిసిందే. తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ (హాన్ హై టెక్నాలజీ గ్రూపు) ప్రఖ్యాత యాపిల్ ఐఫోన్ల తయారీని చేపడుతున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మార్చి 2023లో తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియు స్వయంగా వచ్చి, అప్పటి సీఎం కేసీఆర్‌తో సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం నాటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వాసంతో సుమారు రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు కంపెనీ ముందుకొచ్చింది. ఒప్పందం ప్రకారం అప్పుడే ప్రభుత్వం ఫాక్స్‌కాన్‌కు రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో 186.7 ఎకరాలు కేటాయించింది.

# తొక్కిసలాటతో అంతా తలకిందులు.. అమ్మకానికి ఆర్సీబీ ఫ్రాంచైజీ?



ఐపీఎల్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 18వ సీజన్‌లో ట్రోఫీని ముద్దాడింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇక ఐపీఎల్‌లో ఆర్సీబీ శకం మొదలైందని అభిమానులు సంబుంపడుతున్న వేళ.. ఫ్రాంచైజీని అమ్మేయాలని యాజమాన్యం భావిస్తోంది. మంచి ధర పలికితే ఏమాత్రం ఆలోచించకుండా బెంగళూరు జట్టును వదిలించుకోవాలని అనుకుంటోంది డియాగియో గ్రేట్ బ్రిటన్ సంస్థ. ఈ మద్యం కంపెనీకి చెందిన వాటాదారులు ఐపీఎల్‌లో జట్టును కొనసాగించేందుకు అయిష్టత చూపిస్తున్నారట. అందుకే.. ఆర్సీబీని అమ్మేయడమే మంచిదని సంస్థ ఆలోచిస్తోంది. అయితే.. చిన్నస్వామి తొక్కిసలాట, పోలీస్ కేసు తదనంతర పరిణామాల నేపథ్యంలో కొత్తవాళ్లకు జట్టును అప్పగించేం దుకు ఆర్సీబీ యాజమాన్యం సిద్ధపడుతోంది. విరాట్ కోహ్లీ వంటి స్టార్ ఆటగాడు ఉన్న ఆర్సీబీ మార్కెట్ విలువ భారీగానే ఉంది. 'ఐపీఎల్ విజేత' అనే ట్యాగూ ఉండడంతో రూ.1.75లక్ష కోట్లకు ఫ్రాంచైజీని అమ్మాలని డియాగియో గ్రేట్ బ్రిటన్ కంపెనీ పావులు కదుపుతోంది. వామ్మో.. అంత రేటా? అని ఆశ్చర్యపోతున్నారంతా. అయినా సరే ఆర్సీబీని కొనేందుకు ఆరు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. భారత్‌కు చెందిన నాలుగు కంపెనీలతో పాటు అమెరికాకు సంబంధించిన రెండు సంస్థలు కూడా డియాగియో యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం 'అడార్ పూనావాలా' (సీరమ్ ఇనిస్టిట్యూట్), జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ అధినేత పార్థ్ జిందాల్, అదానీ గ్రూప్ యాజమాన్యం రేసులో ఉన్నాయని తెలుస్తోంది. ఐపీఎల్ జట్టును హస్తగతం చేసుకోవాలని పూనావాలా ఫ్యామిలీకి ఎప్పటినుంచో ఉంది. 2010లో ఆడార్స్ తండ్రి సైరస్ జట్టును కొనేందుకు ఇన్విటేషన్ టు టెండర్ కూడా వేశాడు. కానీ, సహారా గ్రూప్, రెండెజ్‌వస్ స్పోర్ట్స్ బిడ్స్ దక్కించుకున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలో సగం వాటా కలిగిన పార్థ్ జిందాల్ సొంతగా ఒక జట్టుకు బాస్ అవ్వాలనుకుంటున్నాడు. అందుకే.. ఆయన ఆర్సీబీని కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నాడు. అదానీ గ్రూప్ కూడా తమకు ఒక ఐపీఎల్ టీమ్ ఉండాలని అనుకుంటోంది. 2022లో బీసీసీఐ కొత్తగా గుజరాత్ టైటాన్స్ లక్నో సూపర్ జెయింట్స్ అనే రెండు ఫ్రాంచైజీలను ప్రకటించింది. అప్పుడు అదానీ గ్రూప్ టైటాన్స్‌ను దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నమే చేసింది.

**11 మంది మరణించగా..**

ఐపీఎల్‌లో భారీగా అభిమానగణం కలిగిన ఆర్సీబీ పంతొమ్మిదో సీజన్‌తో తమ ట్రోఫీ కలను సాకారం చేసుకుంది. అందని ద్రాక్షను పట్టేసిన సంతోషాన్ని అభిమానులతో పంచుకోవాలని ఘనంగా విక్టరీ పరేడ్ నిర్వహించాలనుకుంది కానీ, చిన్నస్వామి స్టేడియానికి ఫ్యాన్స్ భారీగా పోటెత్తడంతో తొక్కిసలాట జరిగింది. 11 మంది మరణించగా.. 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకరమైన ఘటనతో ఆర్సీబీ యాజమాన్యం అప్రతిష్టపాలైంది. కనీస భద్రతా జాగ్రత్తలు తీసుకోకుండా విజయయాత్రకు సిద్ధమవ్వడంతో పోలీసు కేసు.. ఆపై చిన్నస్వామి స్టేడియంపై ఆంక్షలు విధించింది కోర్టు. అంతే.. పోలీసులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆ మైదానంలో ఒక్కటంటే ఒక్క మ్యాచ్ కూడా జరుగలేదు. అందుకే.. ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి ముందే ఆర్సీబీని అమ్మేసి.. చేతులు దులిపేసుకోవాలని అనుకుంటోంది డియాగియో గ్రేట్ బ్రిటన్ కంపెనీ.

### శ్రీలంక పాలిట విలన్‌లా వరుణుడు.. వరుసగా మూడో మ్యాచ్ రద్దయ్యేనా?



స్వదేశంలో జరుగుతున్న వన్డే వరల్డ్ కప్‌లో శ్రీలంకకు బోణీ కష్టాలు తప్పడం లేదు. సొంతగడ్డపై అదరగొడుతూ పాయింట్ల ఖాతా తెరవాలనుకుంటున్న లంకను వరుణుడు వెంటాడుతున్నాడు. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో జరగాల్సిన మ్యాచ్‌లు వాన కారణంగా రద్దు అయ్యాయి. ముచ్చటగా మూడోసారి కూడా శ్రీలంక మ్యాచ్‌కు వర్షం అడ్డుపడింది. ఒకవేళ ఆట సాధ్యం కాకుంటే లంక కొంప కొల్లేరు అయినట్టే. ఎందుకుంటే.. ఇప్పటికే రెండు పాయింట్లతో సెమీస్ రేసులో వెనకబడిన చమరి ఆటపట్టు బృందానికి ఇది మింగుడుపడని విషయమే. కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో శుక్రవారం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన చమరి ఆటపట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. లంక ఇన్నింగ్స్ 12 ఓవర్లు పూర్తి కాగానే వాన అందుకుంది. భారీగా చినుకులు పడడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. అప్పటికీ లంక స్కోర్ 462. కవిశ దిల్హరి(6), హర్షిత సమరవిక్రమ(5)లు అజేయంగా క్రీజులో ఉన్నారు. 4:15 గంటలకు వాన తెరిపినివ్వడంతో ఇరుజట్ల ప్లేయర్లు హమ్మయ్య అనుకున్నారు. కానీ, మేఘాలు దట్టంగా కమ్ముకోవడంతో ఆట సాధ్యమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ మ్యాచ్ కూడా వర్షార్పణం అయితే.. లంక కంటే దురదృష్టమంమైన జట్టు ఇంకోటి ఉండదేమో.

## క్రీడా వాయిస్

### ఆ ఇద్దరి సమక్షంలో గిల్ మరింత రాటుదేలుతాడు





ఇంటర్నెట్ డెస్క్: మరో రెండు రోజుల్లో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ మొదలుకానుంది. తొలిసారి వన్డే సారథ్యం చేపట్టిన గిల్ జట్టును ఎలా నడిపిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. జట్టులో ఇద్దరు స్టార్లు ఉన్నారు. వారిలో ఒకరు విరాట్ కోహ్లీ కాగా.. మరొకరు ఇటీవలే కెప్టెన్సీ బాధ్యతలను కోల్పోయిన రోహిత్ శర్మ. వీరిద్దరితో కలిసి గిల్ జట్టును నడిపించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సారథిగా గిల్ మెరుగ్గా మారడానికి ఇదొక చక్కటి వేదిక అని.. స్టార్ క్రికెటర్లు డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండటం తప్పకుండా కలిసొస్తుందని తెలిపాడు. ఆసీస్‌తో తొలి వన్డేకు ముందు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అక్షర్ మాట్లాడాడు. "ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లా ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ శుభ్‌మన్ గిల్‌కు సారథిగా నిరూపించుకొనేందుకు మంచి అవకాశం. తప్పకుండా గొప్పగా మారుతుందని భావిస్తున్నా. కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకొనేటప్పుడు అతడు ఎప్పుడూ ఒత్తిడికి గురికాలేదు. గిల్‌లో ఉన్న మంచి లక్షణమదే. ఇతరుల సారథ్యంలోనూ నేను ఆడా. ఇప్పుడు యువ క్రికెటర్లు వచ్చారు. ఇది పరివర్తన కాలం. సీనియర్లు, జూనియర్లతో కలిసి మేం ఆడుతున్నాం. మా అనుభవాలను కుర్రాళ్లతో పంచుకుంటున్నాం. ఐపీఎల్‌లో ఆడిన అనుభవం వారికి కలిసి వస్తోంది" అని అక్షర్ వ్యాఖ్యానించాడు.

అప్పుడు ధోనీ.. ఇప్పుడు గిల్


"డ్రెస్సింగ్ రూమ్‌లో రోహిత్, విరాట్ కోహ్లీ ఉండటం మాకు చాలా మేలు చేస్తుంది. మరీ ముఖ్యంగా కెప్టెన్‌గా గిల్ మరింత మెరుగవుతాడు. పరిస్థితులను ఎలా హ్యాండిల్ చేయాలో అవగాహన వస్తుంది. వారిద్దరి సూచనలు గిల్‌కు చాలా తోడ్పాటు అందిస్తాయి" అని అక్షర్ తెలిపాడు. ఎంఎస్ ధోనీ సారథిగా బాధ్యతలు చేపట్టినప్పుడు క్రికెట్ దిగ్గజాలు సచిన్ తెందూల్కర్, రాహుల్ ద్రవిడ్ జట్టులో ఉన్నారు. దాదాపు ఐదేళ్లపాటు ధోనీ నాయకత్వంలోనే ఆడారు. ఇప్పుడు గిల్ కూడా ఇద్దరు సీనియర్ క్రికెటర్లు టీమ్‌లో ఉన్నప్పుడే కెప్టెన్‌గా వచ్చాడు.

# మాస్ జాతరతో రవితేజ మిషన్ స్టార్ట్

**వరుగా నాలుగు డిఫరెంట్ జానర్లతో అలరించే ప్రయత్నం**



మాస్ మహారాజా రవితేజ మళ్లీ మాస్ ట్రాక్‌లోకి రావడానికి సిద్ధమయ్యాడు. ఈ నెల అక్టోబర్ 31న విడుదల కానున్న ఆయన 75వ చిత్రం 'మాస్ జాతర' తర్వాత వరుసగా మూడు కొత్త సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఒక్కో సినిమా వేర్వేరు జానర్‌లో ఉండటంతో, ఈసారి రవితేజ కెరీర్‌ను రీబూట్ చేసే సిరీస్ ఇదే అవుతుందని అభిమానులు నమ్ముతున్నారు. 'ధమాకా' తర్వాత మరోసారి శ్రీలీలతో జోడీ కట్టిన రవితేజ, ఈసారి కూడా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి రెడీ అవుతున్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను నాగవంశీ మరియు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్లు మంచి రెస్పాన్స్ అందుకుంటున్నాయి. రవితేజ మార్క్ మాస్ యాక్షన్, ఎనర్జీతో కూడిన ఎంటర్‌టైనర్‌గా ఇది నిలిచే అవకాశం ఉంది. 'నేను శైలజ', 'రెడ్' వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తున్న 76వ సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇందులో ఆషికా రంగనాథ్, కేతిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. స్పెయిన్‌లో షూటింగ్ జరుగుతున్న ఈ చిత్రానికి మొదట 'అనార్కలి' అనే టైటిల్ పరిశీలించగా, చివరికి ఈ పేరునే ఫైనల్ చేసినట్లు సమాచారం. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి 2026లో విడుదల కానుంది. 77వ ప్రాజెక్ట్ కోసం రవితేజ 'నిన్ను కోరి', 'మజిలీ', 'ఖుషీ' దర్శకుడు శివ నిర్వాణతో జట్టుకట్టనున్నారు. ఇది ఓ థ్రిల్లర్ డ్రామా జానర్‌లో తెరకెక్కనుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో రవితేజ తన వయసుకు తగ్గ సీరియస్, ఇంటెన్స్ పాత్రలో కనిపించబోతున్నాడని సమాచారం.



# జటాధర ట్రైలర్.. భయపెడుతోన్న ధన పిశాచి!

టాలీవుడ్ యంగ్ హీరో సుధీర్ బాబు లేటెస్ట్ మూవీ 'జటాధర'. డివోషనల్ బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా కూడా నటిస్తోంది. ఇప్పటికే టీజర్ రిలీజ్ చేసిన మేకర్స్.. తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. ప్రిన్స్ మహేశ్ బాబు చేతుల మీదుగా ట్రైలర్ రిలీజైంది. కాగా.. ఈ సినిమాకు వెంకటేశ్ కల్యాణ్- అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తుండగా.. జీ స్టూడియోస్-ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ భాషల్లో నవంబర్ 7న రిలీజ్ చేయనున్నారు. 'పూర్వం ధనాన్ని దాచిపెట్టి... మంత్రాలతో బంధనాలు వేసేవాడు' అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఇవాళ విడుదలైన ట్రైలర్ చూస్తే.. ఈ కథను ధనపిశాచి అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ట్రైలర్‌లో సోనాక్షి సిన్హా ధనపిశాచి పాత్రలో విశ్వరూపం చూపించింది. నమ్రతా సిస్టర్ శిల్పా శిరోద్కర్ సీన్స్ ఈ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ సినిమా కథేంటో ట్రైలర్ చూస్తేనే ప్రేక్షకులను తెలిసిపోతోంది.

# కొత్త దర్శకుడితో విక్రమ్ సినిమా ప్లాన్



పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసే అతికొద్ది మంది కథానాయకులలో నటుడు విక్రమ్ ఒకరు. ఈయన జయాపజయాలకు అతీతుడనే చెప్పాలి. విక్రమ్ చిత్రం వస్తుందంటేనే అభిమానుల్లో అంచనాలు వేరే లెవెల్‌లో ఉంటాయి. ఈయన ఇటీవల హీరోగా నటించిన వీర ధీర సూరన్ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధించింది. ముఖ్యంగా విక్రమ్ నటన, శారీరక భాషకు ప్రశంసలు లభించాయి. తదుపరి రెండు మూడు చిత్రాల్లో విక్రమ్ నటించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అవన్నీ చర్చల దశలో ఉన్నాయి. కాగా ప్రస్తుతం శాంతి టాకీస్ సంస్థ నిర్మిస్తున్న చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారని సమాచారం. కాగా తాజాగా విక్రమ్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. యువ దర్శకుడు విష్ణు ఎడవన్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటించనున్నారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ కలిసి నటిస్తున్న హాయ్ చిత్రం ద్వారా విష్ణు ఎడవన్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. దీన్ని జి.స్టూడియోస్, లలిత్ కుమార్, దర్శకుడు విఘ్నేష్ శివన్ కలిసి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. తదుపరి విక్రమ్ హీరోగా చిత్రం చేయడానికి సిద్ధం అవుతున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందించనున్నట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి కె.గణేశ్ నిర్మించనున్నట్లు సమాచారం. హాయ్ చిత్రాన్ని పూర్తి చేసిన తరువాత విక్రమ్ హీరోగా నటించే చిత్రానికి విష్ణు ఎడవన్ దర్శకత్వం వహించనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.



# తెలుగు రాష్ట్రాల్లో సెంచరీ దాటేసిన కాంతార

మూడేళ్ల క్రితం ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చిన కాంతార సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. కేవలం రూ.15- 20 కోట్లతో నిర్మిస్తే ఏకంగా రూ.450 కోట్ల వరకు వసూళ్లు రాబట్టింది. ఈ సినిమా ప్రీక్వెల్‌గా కాంతార: చాప్టర్ 1 తెరకెక్కించారు. కాంతార లాగే.. కాంతార 1 బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేస్తుందా? ప్రేక్షకుల్ని మెప్పిస్తుందా? లేదా? అన్న అనుమానాలు ఉండేవి. ఆ అనుమానాలన్నింటినీ పటాపంచలు చేసింది కాంతార 1. రిషబ్ శెట్టి స్వీయదర్శకత్వం వహించి హీరోగా నటించిన ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బాక్సాఫీస్ రికార్డులు తిరగరాస్తూ వసూళ్ల ఊచకోత కొనసాగిస్తూనే ఉంది. ఈ రెండు వారాల్లో తెలుగు రాష్ట్రాల్లో రూ.105 కోట్లు రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.717.50 కోట్లు కలెక్ట్ చేసి వెయ్యి కోట్ల దిశగా పరుగులు తీస్తోంది. అలాగే హిందీలో అత్యధిక వసూళ్లు సాధించిన సౌత్ సినిమాల లిస్టులోనూ చేరిపోయింది. కాంతార విషయానికి వస్తే రిషబ్ శెట్టి (%=అంష్టుఎ వాష్ట్రవ్ఎ%) హీరోగా నటించిన ఈ మూవీలో రుక్మిణి వసంత్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రలు పోషించారు. హొంబలే ఫిలింస్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈసినిమాకు అజనీష్ లోకనాథ్ సంగీతం అందించారు.

# ముస్లిం కుటుంబంలో పుట్టి క్రైస్తవ మతాన్ని స్వీకరించిన రెజీనా కసాండ్రా.. కారణాలు వెల్లడించిన నటి!



సౌత్ ఇండస్ట్రీలో తన అందం, అభినయంతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి రెజీనా కసాండ్రా మరోసారి వార్తల్లో నిలిచింది. ఇటీవల ఆమె తన వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా మత మార్పిడి గురించి ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించిన రెజీనా, కేవలం 9 ఏళ్ల వయసులోనే పిల్లల టీవీ ఛానల్‌లో యాంకర్‌గా తన కెరీర్ ప్రారంభించింది. తన ముద్దుముద్దు మాటలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, చిన్నతనంలోనే కళారంగంపై ఆసక్తి చూపింది. 14 ఏళ్ల వయసులో నటుడు ప్రసన్న, లైలా జంటగా నటించిన తమిళ చిత్రం 'కంద నాన్ మూ' లో లైలా చెల్లెలుగా నటించింది. ఆ తర్వాత 2012లో తెలుగు సినిమా 'శివ మనసులో శ్రుతి' తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి, తొలి సినిమాతోనే సైమా ఉత్తమ తొలి నటి అవార్డు అందుకుంది. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో పలు సినిమాలు చేసిన రెజీనా, తెలుగులో ప్రత్యేకమైన ఫ్యాన్‌బేస్ సంపాదించింది. 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్', 'ఈనాడు', 'అవును 2', 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా' వంటి సినిమాల ద్వారా తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రెజీనా మాట్లాడుతూ తన మత మార్పు గురించి ఓపెన్‌గా చెప్పింది. "నా నాన్న ముస్లిం, అమ్మ క్రిస్టియన్. ఇద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. చిన్నతనంలో నేను ముస్లింగా పెరిగాను. ఆ తర్వాత, ఆరు సంవత్సరాల వయసులో క్రిస్టియన్‌గా మారిపోయాను." అని ఆమె వెల్లడించింది. ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు ఆమె ఓపెన్‌నెస్‌ను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఆమె జీవిత ప్రయాణంపై ఆసక్తిగా స్పందిస్తున్నారు. వివిధ మతాలు, సంస్కృతుల మధ్య పెరిగిన రెజీనా, తన ప్రతిభతో సినీ పరిశ్రమలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఇప్పుడు ఆమె తన నమ్మకాలు, వ్యక్తిగత అనుభవాలను ధైర్యంగా పంచుకోవడం ఆమె వ్యక్తిత్వానికి సంబంధించిన మరో కొత్త కోణాన్ని చూపిస్తోంది.

# రూ.150 కోట్ల యాడ్‌లో శ్రీలీల వామ్మో ఇండియాలోనే కాస్ట్లీ గురూ!



అందం, అభినయం, డ్యాన్స్ లో కోస్టార్లకు గట్టిపోటీనిచ్చే అతికొద్ది భామల్లో టాప్‌లో ఉంటుంది శ్రీలీల. గ్లామరస్ పాత్రలతోపాటు నటనకు ఆస్కామున్న రోల్స్ చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంది. ఈ భామకు సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఒకటి ఇప్పుడు నెట్టింట రౌండప్ చేస్తోంది. శ్రీలీల ఓ క్రేజీ కమర్షియల్‌లో ఛాన్స్ కొట్టేసిందన్న వార్త అభిమానులు, ఫాలోవర్లలో జోష్ నింపుతోంది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ ఏం ప్లాన్ చేసినా గ్రాండ్‌గా ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.. మెర్సల్, బిగిల్, జవాన్ చిత్రాలే దీనికి ఉదాహరణ. ఈ స్టార్ డైరెక్టర్ ఈ సారి మాత్రం ఎవరూ ఊహించని విధంగా అందరినీ ఆశ్చర్యపరిచేలా ఓ యాడ్ ఫిల్మ్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అట్లీ ఇండియాలోనే ఇదివరకెన్నడూ చేయదని అత్యంత ఖరీదైన యాడ్ ఫిల్మ్ ను డైరెక్ట్ చేశాడట. ఇంతకీ ఏంటా యాడ్ అనుకుంటున్నారా..? చింగ్స్ దేశీ చైనీస్ బ్రాండ్ టీవీ కమర్షియల్ యాడ్‌ను తీశాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త హల్ చల్ చేస్తోంది. బాలీవుడ్ స్టార్లు రన్‌వీర్ సింగ్, బాబీ డియోల్‌తోపాటు సౌతిండియా సెన్సేషన్ శ్రీలీల కూడా ఈ భారీ యాడ్‌లో నటించడం విశేషం. త్వరలో ప్రసారం కానున్న ఈ యాడ్ కోసం అట్లీ టీం ఏకంగా రూ.150 కోట్లు ఖర్చు పెట్టిందని సమాచారం. ఇదివరకెన్నడూ లేని విధంగా స్టన్నింగ్ సెట్స్, ప్రపంచ స్థాయి వీఎఫ్ఎక్స్, మల్టీపుల్ లొకేషన్లలో చింగ్స్ దేశీ చైనీస్ యాడ్ క్యాంపెయిన్ సినిమాటిక్ స్టైల్‌లో చేసేందుకు రెడీ అవుతున్నాడని బీటౌన్ సర్కిల్‌లో ఓ వార్త వైరల్ అవుతోంది. షారుక్‌ఖాన్‌తో తెరకెక్కించిన జవాన్ తర్వాత అట్లీ చేస్తున్న తొలి కమర్షియల్ ప్రాజెక్ట్ ఇదే కావడంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com